Follow: @ANNTELUGU
26-06-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 174  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు షాక్

- కౌంటర్లు దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి
- స్పీకర్ తీర్పు కాపీని సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణ జులై 22కు వాయిదా

02



## భద్రగిరికి నవశోభ

- రూ.351కోట్లతో అభివృద్ధి
- 27 నుండి పనులకు శ్రీకారం



02

## బీజేపీ సభ్యత్వం ఉంటేనే భారత పౌరసత్వం అంటారా

విదేశాంగ శాఖ ప్రకటనపై ఎంపీ



02




## తెలంగాణలో ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ ప్రారంభం

02



## కేంద్రమంత్రివర్గంలో.. సంచలనాలు

- కూర్పు ఫైనల్.. ముహూర్తంపై చర్చ
- రాష్ట్రపతితో కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా భేటీ
- ఏపీ నుండి తెరపైకి సీఎం రమేష్.. తెలంగాణ నుండి తెరపై ఇద్దరు?

03




## అవును.. నేను గుంపు మేస్త్రీనే

నా గుంపులో ఉన్న వారంతా బాగా పనిచేస్తారు

రేవంతన్న అని పిలిపించుకోవడమే నాకు ఇష్టం
మూసీని ప్రక్షాళన చేస్తుంటే
నా కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు
ఉద్యోగులకు భీమా ఎంటయుల
కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

03





# తుంగభద్రకు వైభవం

- ఒకే ఫ్రేమ్ లో ముగ్గురు సీఎంలు
- అంతర్రాష్ట్ర జలబాటలో సరికొత్త అధ్యాయం.
- వివాదాలు వద్దు, పరిష్కారాలే ముద్దన్న సీఎం రేవంత్ రెడ్డి
- రేవంత్ డైనమిక్ సీఎం.. చంద్రబాబు నాయుడి ప్రశంసలు

**బెంగళూరు, మహా:** అంతర్రాష్ట్ర జల సంబంధాల్లో ఒక కీలకఘట్టం. మూడు రాష్ట్రాల రైతాంగం ఎదురుచూస్తున్న తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్‌వే గేట్ల పునరుద్ధరణ కార్యక్రమం గురువారం జరగ్గా, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎనుముల రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్ లు ఈ గేట్లను ఉమ్మడిగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.51 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవంతో రాయలసీమ, తెలంగాణ కరువు జిల్లాల జలకష్టాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తమైంది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముందే కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అత్యున్నత స్థాయి భేటీ నిర్వహించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలకమైన అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక నేత డీకే శివకుమార్ ప్రత్యేకంగా భేటీ కాగా, తెలంగాణ


మిగితా 2వ పేజీలో



## రామకృష్ణారావుకు కీలక బాధ్యతలు

- ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా ప్రస్తుత సీఎస్?
- ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

02



## ఈసారి పంచముఖ రూపంలో ఖైరతాబాద్ మహాగణపతి!

02

## కంది శ్రీనివాస రెడ్డి ప్రజాదర్బార్

క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం..
పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

పలు సమస్యలపై దరఖాస్తులిచ్చిన ప్రజలు పరిష్కారానికి కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి హామీ

07






## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు

- జులై 1 నుంచి కొత్త ధరలు


02




## యూరియాకు ఢోకా లేదు

- మన యూరియా యాప్ కు ప్రధాని మోదీ ప్రశంసలు
- 30న ఖమ్మంలో 'రైతు ఆశీర్వాద సభ'
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

02







## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు.. జూలై 1 నుంచి కొత్త ధరలు

**ఢిల్లీ, మహా :** పాస్‌పోర్ట్ జారీకి సంబంధించిన రుసుములను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. సవరించిన ధరలు 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ మేరకు జూన్ 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా సవరణల ప్రకారం, సాధారణ కేటగిరీలో 36 పేజీల అడల్ట్ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కి (67 శాతం పెంపు) పెరిగింది. అదేవిధంగా, 60 పేజీల పాస్‌పోర్ట్ రుసుము రూ.2,000 నుంచి రూ.3,500కి (75 శాతం పెంపు) చేరింది. తత్కాల్ స్కీమ్ కింద 36 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇక 18 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,750గా నిర్ణయించారు. పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా లేదా పాడైపోయినా తిరిగి పొందేందుకు అయ్యే రీప్లేస్‌మెంట్ ఖర్చులను కూడా గణనీయంగా పెంచారు. సాధారణ విధానంలో 36 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాలి. వీటినే తత్కాల్ విధానంలో పొందాలంటే వరుసగా రూ.7,500, రూ.8,500 ఖర్చవుతుంది. కాగా, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) ఫీజును రూ.750గా ఖరారు చేశారు. జూలై 1 నుంచి కొత్త ధరలు వర్తిస్తాయి. పాస్‌పోర్ట్ కాలపరిమితిలో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. పెద్దలకు 10 ఏళ్లు, మైనర్లకు 5 ఏళ్ల పాటు పాస్‌పోర్ట్ చెల్లుబాటు కానుంది.



## బీజేపీ సభ్యత్వం ఉంటేనే

**హైదరాబాద్, మహా** : పాస్ పోర్టు కేవలం ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమే.. పౌరసత్వానికి గుర్తింపు కాదన్న కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖప్రకటనపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు పాస్ పోర్టును పౌరసత్వానికి గుర్తింపు కాదన్నారు రేపు బీజేపీ సభ్యత్వం ఉన్నవాళ్లకే భారత పౌరసత్వం అని అంటారు.. త్వరలో జరగబోయేది ఇదే అని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగాపాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్ణయాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బర్త్ సర్టిఫికెట్ కాదు, ఆధార్ కార్డు కాదు ఇలా అన్నింటికీ ఏదో ఒక కారణం చెప్పి పని చేయదంటే భారత పౌరులమని గుర్తింపు కోసం ఏం చూపించాలని కేంద్రాన్ని నిలదీశారు. తాను చేసిందే చట్టం, చెప్పిందే వేదం అన్నట్లుగా మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం దుర్మార్గమని, ఇది దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. ఈ విషయంలో కేంద్రంపై ఎంఐఎం పోరాడుతుందని, భారత పౌరులని నిరూపించుకునేందుకు ఏ డాక్యుమెంట్ చూపించాలో చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు .14వ పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాస్ పోర్టు, పౌరసత్వం గుర్తింపు పై కీలక వ్యాఖ్యలు చేసింది. పాస్ పోర్టు కేవలం ట్రావెలింగ్ డాక్యుమెంట్ మాత్రమే.. పౌరసత్వానికి అది గుర్తింపు కాదు అని ప్రకటించింది. 1967 పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం భారత పౌరుడు కాని వ్యక్తికీ పాస్‌పోర్ట్ లేదా ప్రత్యేక ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చు. ఈ నిబంధనే పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి సంపూర్ణ, తుది గుర్తింపుగా పరిగణించలేమని సూచిస్తోందని క్లారిటీ ఇచ్చింది. దీంతో దేశ పౌరులలో గందరగోళం, ఆందోళన రేకెత్తించింది.

# తుంగభద్రకు వైభవం



( మొదటి పేజీ తరువాయి )

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ఒక 15 నిమిషాల ఆలస్యంగా చేరుకున్నారు. అనంతరం ముగ్గురు పాలకులతో పాటు కేంద్ర మంత్రి నీటి సమస్యలపై, ముఖ్యంగా తుంగభద్ర జలాశయంలో పేరుకుపోయిన పూడికతీత వ్యవహారంపై, తెలంగాణకు అందాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటాలపై అత్యంత ప్రాధాన్యత కలిగిన చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం నేరుగా డ్యాం వద్దకు చేరుకుని గేట్లను ప్రారంభించిన నేతలు, అక్కడ నుంచి విజయనగర జిల్లా హోసపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు.

**మాకు నీళ్ళు ముఖ్యం.. గొడవ కాదు- సీఎం రేవంత్ రెడ్డి**

హోసపేట బహిరంగ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయని ఆయన కొనియాడారు. పాలమూరు జిల్లా నుంచి ఉపాధి కోసం ప్రజలు పడుతున్న వలసల కష్టాలు, కరువుతో రాయలసీమలోని కర్నూలు, అనంతపురం రైతాంగం ఎదుర్కొంటున్న సుదీర్ఘ పోరాటాలు తనకు క్షుణ్ణంగా తెలుసని భావోద్వేగంగా పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల, నీటి సమస్యలను సకాలంలో పరిష్కరించుకోకపోవడం వల్లే విలువైన కృష్ణా, తుంగభద్ర జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇప్పుడు కావాల్సింది అనవసరపు పంచాయితీలు, గొడవలు కాదని, దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఇదే వేదికపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై రేవంత్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మనందరి కష్టాలు, తెలుగు ప్రజల సమస్యలు పూర్తిగా తెలిసిన ఏకైక అనుభవజ్ఞుడైన నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఆయన కొనియాడారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఇప్పుడు ఒక కొలిక్కి రావడం శుభపరిణామమని చెప్తూనే, తెలంగాణ ప్రయోజనాలపై ఘాటుగా మాట్లాడారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు రావాల్సిన 10 టీఎంసీల నీరు అందడం లేదని, ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) కింద ఉన్న రైతులకు కచ్చితంగా పూర్తి న్యాయం జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాతో పాటు తుంగభద్ర పూడికతీతపై కేంద్ర జలశక్తి మంత్రితో ప్రత్యేకంగా చర్చించామని, ఆయన ఖచ్చితంగా ఈ సమస్యలన్నింటికీ తటస్థంగా, న్యాయబద్ధంగా పరిష్కారం చూపిస్తారనే నమ్మకం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా రేవంత్ రెడ్డిని డైనమిక్ సీఎం అంటూ చంద్రబాబు ప్రశంసలు కురిపించారు.

## రామకృష్ణారావుకు కీలక బాధ్యతలు

- **ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా ప్రస్తుత సీఎస్?**
- **ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.**



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీగా పెట్టుబడులను ఆకర్షించే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'తెలంగాణ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ' (ఇన్వెస్ట్ తెలంగాణ) పేరుతో ఓ నూతన విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఏజెన్సీ పగ్గాలను రాష్ట్ర ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావుకు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ఈ నెల 30వ తేదీన సీఎస్‌గా పదవీ విరమణ చేయనున్నారు. అనంతరం ఆయన్ను ఇన్వెస్ట్ తెలంగాణ విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. విదేశీ కంపెనీలను రాష్ట్రానికి రప్పించడం, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరిచే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత నెల 20న అధికారులతో జరిపిన ఉన్నతస్థాయి సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశీ పెట్టుబడుల సాధన కోసం ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ సెల్'ను ఏర్పాటు చేయాలని, అలాగే పెట్టుబడిదారులు అనుమతుల కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పించేలా 'ఎస్కార్ట్ ఆఫీసర్' విధానాన్ని తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. ఆ ఆదేశాల మేరకే ఈ కొత్త ఏజెన్సీ రిజిస్ట్రేషన్‌కు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. నూతనంగా ఏర్పాటయ్యే ఈ ఇన్వెస్ట్ తెలంగాణ ఏజెన్సీలో ఎండీతో పాటు ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), అలాగే ఐటీ, లాజిస్టిక్స్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ తదితర కీలక రంగాలకు సంబంధించి విడివిడిగా మరో ఐదుగురు సెక్టోరియల్ డైరెక్టర్లను కూడా ప్రభుత్వం నియమించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## యూరియాకు ఢోకా లేదు

**ఖమ్మం, మహా :** రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ ఎరువుల కొరతతో ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా అందరికీ సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా సహించేది లేదని కఠినంగా హెచ్చరించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జూన్ 30న జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని గురువారం మంత్రి తుమ్మల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతాంగాన్ని ఉద్దేశించి పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల శ్రేయస్సు దృష్ట్యా అప్పులు తెచ్చి మరీ వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు 'ప్రజా ప్రభుత్వం' అహర్నిశలు శ్రమిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిన 'యూరియా యాప్' దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. యాప్‌లో ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలు పక్కాగా ఉంటున్నాయని, ఈ విధానం అద్భుతంగా ఉందని సాక్షాత్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రశంసించారని మంత్రి గుర్తుచేశారు.


**రూ.9 వేల కోట్లతో రైతు భరోసా**

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ప్రభుత్వం, జూలై నెలలోనే రైతులకు 'రైతు భరోసా' నిధులను అందించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా రూ.9 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారని ప్రకటించారు. అందుకే ఈ నెల 30న నిర్వహించే ముఖ్యమంత్రి సభకు 'రైతు ఆశీర్వాద సభ'గా అన్నదాతలే నామకరణం చేశారని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధికంగా పంటలు పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని, రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే బాధ్యతగా కొనుగోలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ కొనుగోళ్ల ప్రక్రియలో ప్రభుత్వానికి ఏటా రూ.10 వేల కోట్ల మేర నష్టం వస్తున్నప్పటికీ రైతుల మేలు కోసమే ఈ భారాన్ని భరిస్తున్నామన్నారు. గడిచిన రెండేళ్ల వ్యవధిలోనే ఏకంగా లక్ష కోట్ల రూపాయలను అన్నదాతల చేతికి అందించిన ఘనత తమకే దక్కుతుందని మంత్రి గర్వంగా చెప్పారు.

**28, 29 తేదీల్లో భారీ వ్యవసాయ ప్రదర్శన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు ముందే, అన్నదాతలకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 28 నుంచి సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక 'రైతు ఎగ్జిబిషన్'ను ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల ప్రకటించారు. 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు ఇక్కడే అందుబాటులో ఉండి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. అనంతరం 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే 'రైతు ఆశీర్వాద సభ' చారిత్రాత్మకంగా నిలిచిపోయేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, అడుగడుగునా రైతులకు పెద్దపీట వేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.





ఈసారి పంచముఖ రూపంలో..

## ఖైరతాబాద్ మహాగణపతి!


**హైదరాబాద్, మహా** : భాగ్యనగరంలో వినాయక చవితి అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ ఏడాది వినాయక చవితి పండగను పురస్కరించుకుని గురువారం ఖైరతాబాద్ గణేశుడి ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా 'కర్రపూజ' నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ఈసారి కొలువు దీరనున్న స్వామివారి అధికారిక విగ్రహ నమూనా (ల్యాండ్‌స్కేప్ చిత్రం)ను ఉత్సవ కమిటీ ఘనంగా విడుదల చేసింది. ప్రతి ఏటా అత్యంత ఎత్తైన, సరికొత్త ఆధ్యాత్మిక రూపంతో భక్తులను మురిపించే లంబోదరుడు.. ఈసారి ఏకంగా 69 అడుగుల భారీ ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక విగ్రహ తయారీ పనుల ప్రారంభ సూచికగా జరిగిన కర్రపూజ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో పాటు ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ఎంజీఆర్ లక్ష్యం

**ఖైరతాబాద్, మహా :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్‌లో 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గాంధీ తాత నగర్‌లో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పర్యటించారు. గాంధీ తాత నగర్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్న నీటి సమస్య, కలుషిత నీటి సరఫరా మరియు నీటి విడుదలలో సమయపాలన లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, యువకులు పెద్ద ఎత్తున ఎంజీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంజీఆర్.. వాటర్ వర్క్స్ మేనేజర్‌కు ఫోన్ చేసి అక్కడికే పిలిపించారు. మేనేజర్, లైన్‌మన్‌లతో కలిసి ప్రత్యక్షంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నీటిలో పొల్యూషన్ ఎక్కడి నుంచి వస్తుందో గుర్తించి, ఇకపై కలుషిత నీరు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆ ప్రాంతంలోని స్ట్రీట్ లైట్ల సమస్యపై కూడా సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే మరమ్మతులు చేయాలని, అవసరమైతే కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య తెలిసిన వెంటనే స్పందిస్తూ, నిరంతరం ప్రజల మధ్యే ఉండే నాయకుడు ఎంజీఆర్ అని స్థానికులు కొనియాడారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు షాక్



**హైదరాబాద్, మహా :** పార్టీ మారిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం కీలక విచారణ జరిగింది. సదరు శాసనసభ్యులు పార్టీ ఫిరాయించలేదంటూ శాసనసభ స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను న్యాయస్థానం విచారించింది. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు తాలూకు కాపీలను తక్షణమే తమ ముందు ఉంచాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణ సందర్భంగా.. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు, అసెంబ్లీ స్పీకర్ కూడా తమ పూర్తి వాదనలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని హైకోర్టు మరోమారు నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి ఈ కేసు వ్యవహారంలో న్యాయస్థానం గతంలోనే వీరికి నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇంతవరకు ఎవరూ కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల విచారణ సందర్భంగా కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అందరూ తప్పనిసరిగా కౌంటర్లు సమర్పించాలని స్పష్టం చేస్తూ.. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 22వ తేదీకి వాయిదా వేసింది.


## తెలంగాణలో ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ ప్రారంభం




**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్‌సర్) సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఇవాళ్టి నుంచి జులై 24 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా.. హిమాయత్ నగర్ వార్డు కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులు అందజేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అందజేస్తారు. ఓటర్లే ఈ దరఖాస్తులను పూర్తి చేసి... బీఎల్‌ఓలకు అందజేయాలని అధికారులు తెలిపారు. రెండు రోజుల తర్వాత బీఎల్‌ఓలు ఇంటింటింకీ వెళ్లి దరఖాస్తులు సేకరిస్తారు. ఏదైనా అత్యవసర సేవల కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని కోరారు. ఒక వేళ బీఎల్‌ఓలు ఇంటికి రాకపోయినా.. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇంగ్లిష్‌లో, మిగతా జిల్లాల్లో తెలుగులో పత్రాలను అందించనున్నారు. బీఎల్‌వోలు ప్రతిరోజు కనీసం ఒక్కో బూత్ పరిధిలో 50 ఇళ్లకు వెళ్లి ఓటర్లకు వాటిని అందజేయాలి. రాష్ట్రంలో ఉన్న మొత్తం 3,38,26,448 ఓటర్లకూ వాటిని ఇవ్వాలి. ఓటర్లు వాటిని పూర్తి చేసి వచ్చే నెల 24లోపు బీఎల్‌వోలకు అందించాలి.

# అవినీతి 'సుచరిత' ఆస్తుల జాతర!

- **సస్పెండెడ్ తహసీల్దార్ ఇళ్లలో ఏసీబీ తనిఖీలు.**
- **రూ.5.05 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు.. మార్కెట్ విలువ మరిన్ని రెట్లు.**
- **కిలోల కొద్దీ బంగారం, వజ్రాభరణాలు, విలాసవంతమైన ప్లాట్లు స్వాధీనం.**



**హైదరాబాద్, మహా:** లంచం తీసుకుంటూ దొరికిపోయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం మాజీ తహసీల్దార్ (ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న) తుమ్మకొమ్మ సుచరితపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరో ఉచ్చు బిగించింది. ఆమె సంపాదించిన అక్రమాస్తులపై ప్రత్యేకంగా కేసు నమోదు చేసిన అధికారులు, గురువారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. సుచరిత తన సేవా కాలంలో లంచగొండితనానికి అలవాటుపడి, అధికార దుర్వినియోగంతో సంపాదించిన కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులు, చరాస్తులను అధికారులు ఈ తనిఖీల్లో కనుగొన్నారు. హైదరాబాదులోని ఆమె నివాసంతో పాటు బంధువులు, బినామీలు, ఇతర సహచరులకు చెందిన మరో మూడు ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఈ సోదాలు చేపట్టాయి.

**రూ.1.20 కోట్ల బంగారం, వజ్రాలు.. విలాసవంతమైన ప్లాట్లు**

ఈ తనిఖీల్లో లభించిన పత్రాల ప్రకారం.. సుచరిత, ఆమె బంధువుల పేరిట భారీగా ఆస్తులున్నట్లు తేలింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం దామరకుంట గ్రామంలో 2 ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటితో పాటు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 3 విలాసవంతమైన ప్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో 2 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక సుచరిత నివాసంలో సోదాలు చేసిన అధికారులకు అక్షరాలా 12 లక్షల రూపాయల నగదు లభించింది. వీటితో పాటు ఆమె ఇంట్లో ఉన్న రూ.1.20 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను చూసి అధికారులు అవాక్కయ్యారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో దాదాపు 38 లక్షల రూపాయల నగదు నిల్వలు ఉన్నట్లు కనుగొన్నారు. ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**అసలు విలువ వంద కోట్లు దాటేనా?***

ఏసీబీ స్వాధీనం చేసుకున్న దస్తావేజుల ప్రకారం.. ఈ మొత్తం ఆస్తుల విలువ రూ.5,05,52,465 (ఐదు కోట్ల ఐదు లక్షల యాభై రెండు వేల నాలుగు వందల అరవై ఐదు రూపాయలు) గా అధికారులు ప్రాథమికంగా తేల్చారు. అయితే ప్రభుత్వ ధరల ప్రకారం లెక్కించిన డాక్యుమెంట్ల విలువ ఇదైనప్పటికీ.. బహిరంగ మార్కెట్‌లో వీటి అసలు విలువ దీనికంటే మరిన్ని రెట్లు ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. సుచరితకు సంబంధించి మరికొన్ని అదనపు ఆస్తుల వివరాలను సేకరించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. గత నెల మే 26వ తేదీన శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో నాలా కన్వర్షన్ (భూమి మార్పిడి) కోసం రైతుల నుంచి ఏకంగా రూ.30 లక్షల లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా తన డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంటూ సుచరిత రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ కేసులోనే ఆమె ప్రస్తుతం రిమాండ్‌పై జైల్లో ఉండగా.. తాజాగా వెలుగుచూసిన ఈ అక్రమాస్తుల పర్వం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# ఆల్‌టైమ్ కనిష్ఠానికి ముడిచమురు ధరలు

- 70 డాలర్ల దిగువకు డబ్ల్యూటీఐ క్రూడ్.
- పశ్చిమాసియాలో తగ్గిన ఉద్రిక్తతలు.
- సాధారణ స్థితికి చేరిన హోర్ముజ్ రవాణా.
- భారత్‌లో ఇంధన ధరల తగ్గుదలపై సర్వత్రా ఆసక్తి.

**ముంబై, మహా :** అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. గడిచిన కొంతకాలంగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న చమురు ధరలు తాజాగా ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. అంతర్జాతీయంగా అత్యంత ప్రామాణికంగా భావించే అమెరికా 'డబ్ల్యూటీఐ' క్రూడ్ ధర బ్యారెల్‌కు ఏకంగా 70 డాలర్ల దిగువకు చేరింది. గురువారం నాటి అంతర్జాతీయ ట్రేడింగ్‌లో ఇది సుమారు 69 నుంచి 70 డాలర్ల మధ్య ఊగిసలాడింది. ఇదే తరుణంలో అంతర్జాతీయ మార్కెట్లలో గరిష్ఠ ధరకు అమ్ముడయ్యే 'బ్రెంట్' క్రూడ్ ధర సైతం భారీగా తగ్గి.. బ్యారెల్‌కు 72 నుంచి 73 డాలర్ల వద్ద స్థిరపడింది.

**ఉద్రిక్తతలు తగ్గడమే ప్రధాన కారణం**

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఈ స్థాయిలో కుప్పకూలడానికి పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) దేశాల మధ్య నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడమే ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన, వ్యూహాత్మకమైన 'హోర్ముజ్ జలసంధి' ద్వారా ముడిచమురు నౌకల రవాణా మళ్లీ పాతపద్ధతిలో సాధారణ స్థితికి చేరుకుంది. దీనివల్ల ఇన్నాళ్లూ మార్కెట్లను ఊగించిన సరఫరా ఆటంకాలు, ముందస్తు ఆందోళనలు పూర్తిగా తొలగిపోయాయి. చమురు నిల్వలు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయాల ఒత్తిడి ఒక్కసారిగా పెరిగి, ధరలు కిందికి దిగివచ్చాయి.

**భారత్‌లో ధరలు తగ్గుతాయా?**

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారు దేశంగా ఉన్న భారతదేశానికి ఈ ధరల తగ్గుదల భారీ ఊరటనిచ్చే అంశమేనని చెప్పాలి. భారత్ తన అవసరాలకు అవసరమైన ముడిచమురులో దాదాపు 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పడిపోవడం వల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ఉన్న ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రయోజనం దేశంలోని సాధారణ వినియోగదారులకు నేరుగా బదిలీ అవుతుందా లేదా అనేది ప్రభుత్వ రంగానికి చెందిన చమురు మార్కెటింగ్ సంస్థల అంతర్గత నిర్ణయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నుల (ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్) లెక్కింపు, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ వంటి పలు కీలక సమీకరణాలపైనే ఆధారపడి ఉంటుందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అవును.. నేను గుంపు మేస్త్రీనే



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే.. అది ఉద్యోగుల వల్లేనని విశ్వసిస్తున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం అమలులో ఉద్యోగుల శ్రమ, సేవ ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే అది కూడా ఉద్యోగుల కృషితోనే అని నమ్ముతానన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి 14 బ్యాంకులతో ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నేను గుంపు మేస్త్రీనే.. అలా అన్నందుకు చాలా మంది అవహేళన చేశారు. అందరూ హేళన చేసినా బాధపడను.. ఈ గుంపంతా నాదే. నా గుంపులో ఉన్నవారంతా బాగా పనిచేస్తుంటారు. కొందరు మేం దొరలమని.. గడీలు ఉన్నాయని గొప్పగా చెప్పుకొంటున్నారు. నాకు మాత్రం రేవంతన్న అని పిలిపించుకోవడమే ఇష్టం. ఇష్టం, ప్రేమ ఉంటేనే.. సీఎంను కూడా అన్నా అని పిలుస్తారు. మూసీని ప్రక్షాళన చేస్తుంటే నా కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు. మెట్రోను విస్తరిద్దామని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. మూసీ నదిని బాగుచేస్తే బాగుపడేదెవరు?మెట్రోను విస్తరిస్తే ఉపయోగం ఎవరికి?ఫాంహౌస్‌లో ఉన్నవాళ్లకు మూసీ, మెట్రోతో పనిలేదేమో కానీ.. పేదలకు అవసరం''అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఇబ్బందులున్నా..**
**ఉద్యోగులకు మొదటి తేదీనే జీతం**

''పీఆర్సీ విషయంలో కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. అందరం అదనంగా మరో గంట కష్టపడి పనిచేద్దాం. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం అమలులో ఉద్యోగుల శ్రమ, సేవ ఉంది. ఉద్యోగులు అడిగింది చేయొద్దనే ఆలోచన నాలో ఉండదు. కేవలం ఆర్థిక సమస్యల వల్లే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తోంది. ఐదేళ్లకోసారి పాలకులు మారినా.. ప్రభుత్వ ఉద్యోగులు మారరు. గతంలో పదేళ్లపాటు పదో తేదీలోపు జీతం వచ్చేది కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలను కూడా వాయిదాలుగా ఇచ్చింది. ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా.. నెలలో మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నాం. ఉద్యోగులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రారంభించాం. కార్మికుల కుటుంబానికి ఇప్పటికే రూ.కోటి చొప్పున చెక్కులు అందజేశాం.

**ఉద్యోగులపై ఒక్క రూపాయి కూడా భారం లేదు- భట్టి విక్రమార్క**

ఉద్యోగులపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఎక్కడా ప్రభుత్వ ఉద్యోగులకు ఇలాంటి ప్రమాదబీమా లేదని చెప్పారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు 15వ తేదీ వరకు జీతాలు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ సర్కారు చేసిన అప్పులు కడుతూనే ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ జీవితబీమా పథకం పెట్టబోతున్నామని వివరించారు. ఉద్యోగులందరికీ నగదు రహిత చికిత్సలకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్, అజారుద్దీన్, ప్రభుత్వసలహాదారు హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు.

# తొమ్మిదో తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'

- చరిత్రలో చీకటి రోజులను కళ్లకుకట్టేలా కొత్త సిలబస్.
- సోషల్ సైన్స్ పుస్తకంలో చేర్చిన ఎన్‌సీఈఆర్‌టీ.
- స్వాగతించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.
- చరిత్ర వక్రీకరణే అంటున్న విపక్షాలు.

**ఢిల్లీ, మహా :** భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన, చీకటి అధ్యాయంగా మిగిలిపోయిన 1975 నాటి అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ఇకపై పాఠ్యాంశంగా మారబోతోంది. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) తొలిసారిగా ఈ కీలక ఘట్టాన్ని పాఠశాల సిలబస్‌లో చేర్చింది. తొమ్మిదో తరగతి సోషల్ సైన్స్ పాఠ్యపుస్తకంలో దీనికి సంబంధించి ఒక నూతన అధ్యాయాన్ని ప్రవేశపెట్టింది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లలో ఎమర్జెన్సీ ఒకటని ఈ పాఠ్యాంశంలో ప్రధానంగా వివరించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్‌సీఈఆర్‌టీ తన పాఠ్య ప్రణాళికలో ఈ కీలక మార్పులు చేసింది. ఇందులో భాగంగానే తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన "అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్" పుస్తకంలో ఎమర్జెన్సీపై ఒక ప్రత్యేక విభాగాన్ని పొందుపరిచారు. ఆ చీకటి రోజుల్లో ప్రాథమిక హక్కుల రద్దు, పత్రికా స్వేచ్ఛపై ఉక్కుపాదం, ప్రతిపక్ష నేతలు, రాజకీయ ప్రత్యర్థుల సామూహిక అరెస్టులు తదితర అంశాలను విద్యార్థులకు స్పష్టంగా అర్థమయ్యేలా ఇందులో కూలంకషంగా వివరించారు.

ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సమర్థించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ సిలబస్ మార్పును స్వాగతించారు. ఎమర్జెన్సీ వంటి చీకటి రోజులు దేశంలో మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే, ఆనాటి చారిత్రక పరిణామాల గురించి భావితరాలకు కచ్చితంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సైతం ఈ అంశంపై స్పందిస్తూ.. భారత రాజ్యాంగ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక మాయని మచ్చ అని, కాంగ్రెస్ పార్టీ నేటికీ అదే నిరంకుశ ధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. అయితే, ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో చోటుచేసుకున్న ఈ ఏకపక్ష మార్పులను ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం చరిత్రను తమకు అనుకూలంగా వక్రీకరిస్తూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని మండిపడుతున్నాయి.



## చెరువులకు మహర్దశ.. పునరుద్ధరణకు హైడ్రా శ్రీకారం


- రూ.107 కోట్లతో నాలుగు ప్రధాన చెరువుల అభివృద్ధి.
- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన కమిషనర్ రంగనాథ్.
- 311 ఎకరాల విస్తీర్ణంలో సరికొత్తగా రూపురేఖలు.
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, బోటింగ్ సౌకర్యాల ఏర్పాటు.

**హైదరాబాద్, మహా :** మహానగరంలో చెరువుల పరిరక్షణే ధ్యేయంగా నడుం బిగించిన హైడ్రా ముందస్తు కార్యాచరణలోకి దిగింది. నగరంలో వరద ముప్పును శాశ్వతంగా నివారించడంతో పాటు, పడిపోతున్న భూగర్భ జలాలను పెంచే బృహత్తర లక్ష్యంతో నాలుగు ప్రధాన చెరువుల సమగ్ర పునరుద్ధరణకు లాంఛనంగా శ్రీకారం చుట్టింది. ఏకంగా రూ.107 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా భూమిపూజ నిర్వహించి, అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కింద నగరంలోని కీలకమైన ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువుతో పాటు కాప్రా చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. మొత్తంగా 311 ఎకరాల విశాల విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులకు సరికొత్త రూపురేఖలు తీసుకురానున్నారు. కబ్జాల బారి నుంచి నీటి వనరులను రక్షించడమే కాకుండా, రాబోయే వర్షాకాలంలో సమీప కాలనీలు జలమయం కాకుండా వరద ప్రభావాన్ని సమర్థవంతంగా అడ్డుకోవడం ఈ పునరుద్ధరణ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా ఈ ప్రాంతాల్లో అడుగంటిన భూగర్భ జలాల మట్టం సైతం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

కేవలం చెరువుల కట్టల పటిష్ఠతకే పరిమితం కాకుండా వాటిని నగరవాసులకు అద్భుతమైన ఆహ్లాద కేంద్రాలుగా మలిచేందుకు హైడ్రా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. పచ్చని వాతావరణం మధ్య ప్రజలు నడిచేందుకు వీలుగా అందమైన వాకింగ్ ట్రాక్‌లు, ఆరోగ్య పరిరక్షణ కోసం ఓపెన్ జిమ్‌లు, అలాగే చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేకంగా కిడ్స్ ప్లే ఏరియాలను ఈ చెరువుల వద్ద ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువులను ప్రధాన పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే దిశగానూ చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో ఈ చెరువుల్లో బోటింగ్ (విహారయాత్ర) సౌకర్యాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హైడ్రా కసరత్తు చేస్తోంది. ఈ పనులన్నీ పూర్తయితే సిటీ జనులకు ఆహ్లాదకరమైన పర్యావరణంతో పాటు, వారాంతాల్లో కుటుంబ సమేతంగా సేదదీరేందుకు సరికొత్త విహార కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.

# కేంద్రమంత్రివర్గంలో.. సంచలనాలు



**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలో పొలిటికల్ హీట్ రాజుకుంది. కేంద్ర మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై గత కొంతకాలంగా జరుగుతున్న చర్చకు తెరదించనున్నారు. రెండు రోజుల క్రితమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా సమావేశం కాగా.. గురువారం కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా గురువారం రాష్ట్రపతితో ఏకాంతంగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. మోదీ, షా ద్వయం వరుసగా రెండు రోజుల వ్యవధిలో రాష్ట్రపతిని కలవడం వెనుక కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన కీలక అడుగులు ఉన్నాయన్న చర్చ హస్తినలో జోరుగా సాగుతోంది. కేబినెట్ లో మార్పులు చేర్పులకు నిర్ణయం తీసుకోగా, ఎవరు ఔట్.. ఎవ్వు ఇన్ అన్న చర్చలు జోరుగా జరుగుతున్నాయి. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టుల రాజ్యసభ పదవీకాలం ముగియడంతో మంత్రివర్గంలో ఖాళీలు ఏర్పడ్డాయి. దీనికి తోడు.. పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన బీజేపీ అధిష్ఠానం, కేంద్ర మంత్రులుగా ఉన్న పలువురు సీనియర్ నేతలకు రాష్ట్రాల పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. ఒక వ్యక్తికి ఒకటే పదవి అన్న పార్టీ అంతర్గత విధానం మేరకు.. ఆయా నేతలు త్వరలోనే తమ మంత్రి పదవులకు రాజీనామా చేయనున్నారు. ఖాళీ అవుతున్న స్థానాలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు ఆధారంగా కొందరిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే దిశగా మోదీషా ద్వయం నిర్ణయించింది.రాబోయే రోజుల్లో జరగనున్న పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ కేబినెట్ కూర్పు ఉండబోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దేశ రాజకీయాలను శాసించే ఈ కీలక రాష్ట్రాల్లోని సామాజిక, వర్గ సమీకరణాలను బేరీజు వేసుకుని, ఆయా వర్గాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా ఓటు బ్యాంకును పదిలపరుచుకునే దిశగా పక్కా ప్లాన్‌తో అడుగులు పడుతున్నాయి. మరోవైపు, జాతీయ ప్రజాస్వామ్య కూటమి భాగస్వామ్య పక్షాల నుంచి కూడా బీజేపీ అధిష్ఠానంపై ఒత్తిడి తీవ్రమవుతోంది. ప్రధానంగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు చెందిన జేడీయూ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గాలు కేబినెట్‌లో అదనపు మంత్రి పదవుల కోసం గట్టిగానే పట్టుబడుతున్నట్లు సమాచారం.ఈ రాజకీయ సమీకరణాలు, మిత్రపక్షాల డిమాండ్లను చాకచక్యంగా సమన్వయం చేసుకుంటూ, సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా కొత్త కేబినెట్ జాబితాను సిద్ధం చేసే పనిలో బీజేపీ అగ్రనాయకత్వం తలమునకలైంది. జులై 20వ తేదీ తర్వాత ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల లోపే ఈ కసరత్తును తుది దశకు చేర్చి, కొత్త మంత్రులతో సభలో అడుగుపెట్టాలని అధికార పక్షం కృతనిశ్చయంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**తెలుగురాష్ట్రాలకు ఛాన్స్**

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కేంద్ర కేబినెట్ లో కొందరికి ఛాన్స్ దక్కనుంది. ప్రధానంగా ఏపీ నుండి మరొకరికి బెర్త్ ఖాయమన్న చర్చ ఉంది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పేరు ప్రధానంగా వినబడుతోంది. టీడీపీకి కూడా మరో బెర్త్ దక్క వచ్చని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఛాన్స్ ఉద్న చర్చ ఉంది. తెలంగాణకు సంబంధించి ఎంపీలందరూ ప్రయత్నాలు చేస్తుండగా, ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావుల పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. అనూహ్యంగా గొడం నగేష్ కు కూడా ఛాన్స్ దక్కవచ్చని వినబడుతోంది.

## జీవో 9పై హైకోర్టు స్టే

- ప్రైవేటు కాలేజీలకు తాత్కాలిక ఊరట
- ఆగస్టు 15లోగా బకాయిలు చెల్లిస్తామని ఏజీ హామీ
- విచారణ జూన్ 30కు వాయిదా

**హైదరాబాద్, మహా:** ప్రైవేటు కాలేజీల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై తెలంగాణ హైకోర్టు జూన్ 30 వరకు మధ్యంతర స్టే విధించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలేజీలు ఎలా నడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధర్మాసనం, బకాయిలు ఆగస్టు 15లోగా చెల్లిస్తామని ఏజీ ఇచ్చిన హామీని నమోదు చేసింది. తదుపరి విచారణను జూన్ 30కు వాయిదా వేసింది.

## ఆర్టీసీ బస్సులో తమిళనాడు సీఎం విజయ్ సందడి!

- కొత్తగా 300 ప్రభుత్వ బస్సులను ప్రారంభించిన ముఖ్యమంత్రి.
- కండక్టర్ సీట్లో కూర్చుని ముచ్చట్లు.. డ్రైవర్‌కు ప్రత్యేక అభినందనలు.



**చెన్నై, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ గురువారం చెన్నై నగర వీధుల్లో ప్రభుత్వ బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, వివిధ ప్రాంతాల మధ్య రవాణా సదుపాయాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో తమిళనాడు రవాణా సంస్థ పరిధిలోకి కొత్తగా 300 బస్సులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నూతన బస్సులను ముఖ్యమంత్రి విజయ్ అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు.

**స్టైలిష్ లుక్‌లో సీఎం.. సిబ్బందితో సరదా ముచ్చట్లు**

బస్సులను ప్రారంభించిన వెంటనే ముఖ్యమంత్రి విజయ్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి నేరుగా ఒక బస్సులోకి ఎక్కారు. తెల్లటి చొక్కా, కళ్లద్దాలు ధరించి పక్కా స్టైలిష్ లుక్‌లో కనిపించిన సీఎంను చూసి అక్కడి వారు ఆనందం వ్యక్తం చేశారు. బస్సులోకి వెళ్లిన ఆయన నేరుగా కండక్టర్ సీటు పక్కన కూర్చుని రవాణా శాఖ సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. తోటి మంత్రులు, ఉన్నతాధికారులు పక్కనే నిలబడి చూస్తుండగా.. కండక్టర్‌తో ఎంతో ఆప్యాయంగా నవ్వుతూ ఫొటోలకు పోజులిచ్చారు.

**డ్రైవర్‌కు భుజం తట్టి అభినందన**

బస్సు దిగే ముందు ముఖ్యమంత్రి విజయ్ డ్రైవర్ సీటు వద్దకు వెళ్లారు. విధుల్లో ఉన్న డ్రైవర్ భుజం తట్టి, బాధ్యతాయుతంగా పనిచేయాలంటూ ప్రత్యేకంగా అభినందించారు. సాధారణ ప్రయాణికుడిలా సీఎం విజయ్ బస్సులో ప్రయాణించిన ఈ వినూత్న దృశ్యాలు, దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి రవాణా సిబ్బందికి ఇచ్చిన ఈ ప్రోత్సాహంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# ఖమ్మం 'విజయా డెయిరీ' మూసివేస్తే సహించం

- ప్రభుత్వ ఆస్తుల దోపిడీకి మంత్రుల భారీ కుట్ర!
- సొంత డెయిరీల కోసం ప్రభుత్వ సంస్థ నిర్వీర్యం.
- డెయిరీ భూములను రియల్ ఎస్టేట్‌కు అప్పగించే పన్నాగం.
- అధికారులతో కుమ్మక్కై వరంగల్ నుంచి పాల సరఫరాకు యత్నం.
- డెయిరీని అంగుళం కదిపినా ఊరుకోం.
- బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి హెచ్చరిక.




**ఖమ్మం, జూన్ 25 :** ఖమ్మం జిల్లా పాడి రైతులకు ఆశాదీపంగా, దశాబ్దాలుగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రతిష్ఠాత్మక 'విజయా డెయిరీ' అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు పాలకుల స్థాయిలో భారీ కుట్ర జరుగుతోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. డెయిరీని ఇక్కడి నుంచి మూసివేసి వరంగల్ నుంచి పాల సరఫరా చేసేందుకు తెరవెనుక ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయన్న రైతుల ఆవేదనతో బీజేపీ నాయకులు గురువారం అప్రమత్తమయ్యారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలో ఉన్న విజయా డెయిరీ ప్రాంగణాన్ని స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, డెయిరీని ఇక్కడి నుంచి తరలిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని నినాదాలు చేశారు. డెయిరీ మూసివేత వార్తల నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకునేందుకే తాము ఇక్కడికి వచ్చామని, రైతుల ఆరోపణల్లో పూర్తి నిజముందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులపై నిప్పులు చెరిగారు. తామేదో జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని, గొప్ప ప్రజాపాలన అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రులు.. తమ కళ్లెదుటే ప్రభుత్వ డెయిరీని మూసివేస్తుంటే ఎందుకు నిద్రపోతున్నారని ఘాటుగా ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ఒక మంత్రి తన సొంత డెయిరీని స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని, ప్రభుత్వ డెయిరీ ఇక్కడే కొనసాగితే తన ప్రైవేట్ డెయిరీకి రైతుల నుంచి పాల సేకరణ జరగదని, అమ్మకాలకు గండిపడుతుందన్న దురుద్దేశంతోనే ఈ మూసివేత కుట్రకు తెరలేపారని సంచలన ఆరోపణలు చేశారు. పాలకుల కళ్లల్లో ఆనందం చూడటం కోసం కొందరు అధికారులు సైతం వారితో కుమ్మక్కై, ఉద్దేశపూర్వకంగానే డెయిరీలో పాల సేకరణను తగ్గించి, అమ్మకాలు లేకుండా చేసి చివరకు దీనిని 'సిక్ యూనిట్' (నష్టాల్లో ఉన్న సంస్థ)గా ప్రకటించేందుకు సర్వశక్తులొడ్డుతున్నారని వారు తీవ్రంగా దుయ్యబట్టారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే జిల్లాలోని విలువైన ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతలు రాబందుల్లా కన్నేశారని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. జిల్లాకే చెందిన భూముల మంత్రి కనుసన్నల్లోనే ఈ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోందని ఆరోపించారు. ఎక్కడ విలువైన ప్రభుత్వ స్థలాలు ఉంటే వాటిని కంప్యూటర్లలో మాయం చేసి, రాత్రికి రాత్రే తమ బినామీల పేర్ల మీదకు మార్చుకుంటున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెలుగుమట్ల ప్రాంతంలోని భూములతో పాటు, సత్తుపల్లిలోని ఫుడ్ పార్కులో ఉన్న 72 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని ఎలాంటి జీఓలు, కనీస ప్రణాళికలు లేకుండానే ప్రైవేట్ కంపెనీలకు అడ్డగోలుగా కట్టబెట్టారని వారు గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు అత్యంత విలువైన విజయా డెయిరీ భూమిని సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకోవాలనో లేదా తమ బినామీలకు ధారాదత్తం చేయాలనో అధికార పక్షం తీవ్రంగా ప్రయత్నిస్తోందని వారు అనుమానం వ్యక్తం చేశారు.వేలాది మంది పాడి రైతులు, డెయిరీపైనే ఆధారపడి పనిచేసే కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఈ ఆస్తులను కాజేయాలని చూసే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు బీజేపీ నేతలు 'ఖబడ్దార్' అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన పాలకులు, తమ చేతిలో అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విజయా డెయిరీ ప్రస్తుతమున్న ఇందిరానగర్ అడ్రస్‌లోనే కొనసాగాలని, అందరం కలిసికట్టుగా దీనిని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. డెయిరీ మూసివేత ఆలోచనలను తక్షణమే విడనాడి, ఇక్కడే పాల సేకరణను, అమ్మకాలను పెంచేలా అభివృద్ధి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు రాయితీ రుణాలు, డెయిరీ ఫామ్స్ పెట్టుకోవడానికి తగిన ప్రోత్సాహకాలు అందించి పాడి పరిశ్రమను బలోపేతం చేయాలని సూచించారు. కుట్రలను ఆపకపోతే డెయిరీని ఇక్కడి నుంచి ఇంచు కూడా కదలనివ్వబోమని, ఒకవేళ అధికార అహంకారంతో మొండిగా ముందుకు వెళ్తే ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉవ్వెత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వానికి బీజేపీ అల్టిమేటం జారీ చేసింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, రుద్ర ప్రదీప్, ప్రధాన కార్యదర్శులు కొత్త వెంకటేశ్వరరావు , నాయుడు రాఘవరావు, ఎస్టీ ఉపాధ్యక్షులు శ్యామ్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ , నకిరేకంటి వీరభద్రం , ఎల్లారావు గౌడ్ , వీరం రాజు, అర్బన్ అధ్యక్షుడు వాకధాని రామకృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి , శాసనాల సాయిరాం , రజినీ రెడ్డి , శ్రీరామనేని మనీ, తాజ్నూత్ భద్రం , దీకొండ శ్యామ్, రీగన్ ప్రతాప్, రాము, పాల్గొన్నారు.

# ఇద్దరు విజేతలు

టెన్షన్... టెన్షన్... టెన్షన్... ఈ టెన్షన్ ఇప్పుడు తీరింది. క్రికెట్ లో సూపర్ ఓవర్ మ్యాచ్ లో ప్రతీ బాల్ ను ఎంత టెన్షన్ తో చూస్తామో ఇప్పుడు అలాగే చూడాల్సి వచ్చింది. మొత్తానికి మ్యాచ్ టై అయింది. హమ్మయ్య. అంటూ తెలంగాణ ప్రజలు ఊపిరి పీల్చుకొని ఇప్పుడు నిబ్బరంగా వున్నారు. ఇంత టెన్షన్ మ్యాచ్ ఇప్పడేం జరిగింది. అసలు ఏ టీమ్ తో ఈ మ్యాచ్ జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎక్కడ జరిగింది? అనే అనుమానం వద్దు. తెలంగాణలోనే ఈ మ్యాచ్ జరిగింది. కాకపోతే ఇక్కడ క్రికెట్ జట్లు మాత్రం రాష్ట్ర కాంగ్రెస్, రాష్ట్ర బీజేపీ. ఈ రెండు పార్టీల మధ్య రాష్ట్రాభివృద్ధి అంశాలను ముందుకు తీసుకొని వెళ్లే విషయంపైన గట్టి పోటీ జరిగింది. అది సూపర్ ఓవర్ అనే సవాళ్ళ వరకు వెళ్ళింది. లేఖలతో హీట్ ఎక్కింది. కాంగ్రెస్ పార్టీకి కెప్టెన్ అయిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నెగ్గుతారా? బీజేపీకి రాష్ట్రంలో మూల స్తంభం అయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై చేయి సాధిస్తారా? ఇదే హాట్ టాపిక్ అయింది. అది సూపర్ ఓవర్ వరకు వెళ్ళింది. ఈ సూపర్ ఓవర్ లో ఇద్దరు నెగ్గారు. ఎవరికీ వారే హీరో అయ్యారు. ఆద్యంతం ఆసక్తిగా సాగిన మ్యాచ్ లో ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరు నెగ్గారు. ఎవరికి వారే తగ్గేదే లే అన్నట్టు వ్యవవహరించినా, ఎక్కడో మొత్తానికి కంప్రమైస్ అయ్యారు. ఇది మంచిదే అయింది. రోజు రొచ్చు పెట్టుకునే కంటే ఇలా కాస్త ఎవరికి వారు తగ్గి ఓ మంచి పనికి పరస్పర సహకారం అందించుకోవటం తెలంగాణ ప్రజలను సంతోష పెట్టింది. సమస్యల పరిష్కారానికి సంయమనం ఎంత అవసరమో చాటి చెప్పింది. ఇది ఓ శుభపరిమాణం. ఇందులో సందేహం లేదు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసిన వారే రాజకీయాల్లో రాణిస్తారు. ఇప్పుడు అదే నిజం అయింది.

తెలంగాణ అభివృద్ధి అంశాలలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మధ్య పెద్ద వార్ నడిచింది. ముఖ్యంగా మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులు... ఇలా తెలంగాణ ప్రగతికి ముడి పడిన అంశాలలో సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య అభిప్రాయ బేధాలు వచ్చాయి. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణం లోన్ వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వ్యక్తిగత ఆరోపణల వరకు వెళ్ళింది. మెట్రో పనులకు సంబంధించిన లోన్ చివరి వరకు వచ్చి నిలిచి పోవటంతో సీఎం రేవంత్ రెడ్డి తట్టుకోలేకపోయారు. లోన్ ఆగి పోవటం వెనుక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హస్తం ఉందంటూ నిప్పులు చెరిగారు. నిందలు వేశారు. దీనికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అదే స్థాయిలో రెస్పాండ్ అయ్యారు. సీఎం చేతకానితనం వల్లే మెట్రో లోన్ మంజూరు ఆగిందన్నారు. ఆ నెపం తన మీద నెట్టి రాజకీయం చేస్తున్నారని గట్టిగా కౌంటర్ ఎటాక్ చేశారు. పరిస్థితి బహిరంగ లేఖల వరకు వెళ్ళింది. మెట్రో రైలు రెండో దశ పనులను ట్రాక్ ఎక్కించాటానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసేందుకు సహకారం అందించాలని, లోన్ మంజూరు అయ్యేలా కలిసి ప్రయత్నం చేద్దామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి సారి లేఖకు కిషన్ రెడ్డి నుంచి ఆశించిన స్పందన రాలేదు. అయినా సీఎం రేవంత్ నిరాశ పడలేదు. రెండో లేఖ కూడా సంధించారు. దీనికి ఫలితం దక్కింది. సీఎం ఢిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా దగ్గర ఉండి ఈ భేటీ ఏర్పాటు చేశారు. సమస్య అశ్వినీ దృష్టిలో కి తెచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ముఖ్యంగా హైదరాబాద్ ప్రగతికి మెట్రో రెండో దశ అవసరం, ఆవశ్యకత ఇరువురు నేతలు అశ్వినీ వైష్ణవ్ కు సవివరంగా చెప్పేశారు. ఆయన నుంచి సానుకూలంగా స్పందన వచ్చింది. ఇక్కడితో ఇది ఆగలేదు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కూడా సీఎం రేవంత్ కలిశారు. మూసీ ప్రక్షాళన కోసం రక్షణ శాఖ నుంచి అందిస్తున్న సహకారం పైన ధన్యవాదాలు తెలిపారు. పనిలో పనిగా కేంద్ర మంత్రి ఖట్టర్ ను కూడా కలిసి సీఎం రేవంత్ తెలంగాణ అవసరాలు, కేంద్ర సహాయం గురించి వివరించారు. ఇక్కడ కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ వెంట ఉండి తన కర్తవ్యం నెరవేర్చారు. ఓ మంచి వాతావరణంలో ఈ భేటీలు జరగాయి. ఇది తెలంగాణకు మేలు చేసే విషయం. అగ్గి మీద గుగ్గిలంలా వ్యవహరించిన ఇద్దరు నేతలు తెలంగాణ ప్రయోజనాల కోసం కలిసి కట్టుగా ముందుకు సాగటం సహేతుక రాజకీయాలకు మచ్చుతునకగా ఇప్పుడు రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఎన్నికల సమయంలో పార్టీల సిద్ధాంతాల మేరకు ఆయా పార్టీ నేతలు నడుచుకోవాలి. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాత్రం ఇదిగో ఇలా ఒకటి అవ్వాలి అంటున్నారు మేధావులు.



సీఎం అయినా, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అయినా జన హితవు మాత్రమే లక్ష్యంగా పెట్టుకొని బాధ్యతగా మెలగాలి. ఇప్పుడు ఇదే జరిగింది. ఇందులో సీఎం బెట్టుగా వున్నా, కేంద్ర మంత్రి పట్టుదలకు పోయినా రాష్ట్రానికి ఇబ్బంది తప్పేది కాదు. ఇక ఇప్పుడు సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ల్లో ఎవరు నెగ్గారు. ఎవరు తగ్గారు అనేది కొందరికి సందేహం. ఇందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. ఇక్కడ ఇద్దరు విజేతలే. రాష్ట్రానికి మేలు జరుగుతుంది అంటే హోదాలు, పదవులు పక్కన పెట్టి ఏకం కావటంలో ఎలాంటి భేషజాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. రాజకీయ నిపుణులు కూడా ఇదే చెప్తున్నారు. పార్టీలు ఏవైనా, సిద్ధాంతాలు ఎలా వున్నా అంతిమంగా ప్రజలకు మంచి జరగాలి. రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుగోడగా నిలుస్తున్నారన్న అపవాదు, ఆరోపణలు ఇప్పుడు ఉఫ్ మని కొట్టుకుపోయాయి. ఇదే విషయం కిషన్ రెడ్డి కూడా స్పష్టంగా చెప్పేసారు. రాష్ట్రాభివృద్ధి అంశాలకు సంబంధించి తెలంగాణ సీఎం తనకు రెండు లేఖలు రాశారని, వాటిని పరిగణలోకి తీసుకొని సీఎం రేవంత్ కోరిన రీతిలో కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశానని తెలిపిన కిషన్ రెడ్డి ఈ భేటీలకు తాను స్వయంగా సమన్వయ కర్తగా ఉన్నట్టు వివరించారు. ఇప్పటి వరకు తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం చేసిన సహాయం కూడా కిషన్ రెడ్డి చెప్పుకుని వచ్చారు. ఇది ఇప్పుడు రాష్ట్ర బీజేపీకి రెట్టింపు బలం ఇచ్చే అంశంగా మారింది. ఇక సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత అంశాలైన మెట్రో రెండో దశ పనులు, మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటివి ముందుకు కదిలే అవకాశం వచ్చింది. రాజకీయాలు ఎప్పుడు ఉండేవే. కానీ ఓ పెద్ద అభివృద్ధి రాష్ట్రం జరిగితే దాని ఫలితాలు భవిష్యత్ తరాలకు అందుతాయి. తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు రేజింగ్ లో వుంది. పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. ప్రపంచ దేశాలు ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరంగా హైదరాబాద్ పరుగులు తీస్తోంది. ఇలాంటి సమయంలో నిరంతరం ప్రగతి సాగుతూనే ఉండాలి.

రాజకీయాలు, అభివృద్ధి రెండు వేరు. వీటిని జత చేయటం సరి కాదు. ప్రజలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి సాగుతుండాలి. నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు పెరగాలి. హైదరాబాద్ వంటి నగరాల్లో వీటి అవసరం మరి ఎక్కువ. విద్యుత్, రవాణా, వాటర్, రోడ్స్, ఆహ్లాదకరమైన వాతావరణం, నివాస యోగ్యమైన పరిస్థితి అభివృద్ధికి ఆయువు పట్టు. ఏ రాష్ట్రం అయినా ఇవే ప్రాధాన్యత అంశాలు. అప్పుడే పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడులు వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వ్యాపారం, వాణిజ్యం వృద్ధి అవుతుంది. అది రాష్ట్రానికి సంపద తెచ్చి పెడుతుంది. ఇది నిరంతరం సాగే ప్రక్రియ. ప్రగతి, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలకు రాజకీయాలు అంటగడితే అది పెద్ద రొచ్చుగా మారుతుంది. ఏది ఏమైనా ఇప్పుడు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎవరికీ వారు ఓ అడుగు ముందుకేసి తెలంగాణ అవసరాలను, కేంద్ర నుంచి అందాల్సిన సహాయం గట్టిగానే కోరటం హర్షనీయం. రాజకీయంగా నేతలు ఆయా సమయంలో విమర్శలు, ఆరోపణలు సంధించుకున్నా, అభివృద్ధి విషయంలో ఇలా ఒకటిగా ముందుకు సాగితే తెలంగాణ త్వరలోనే ఓ ఆదర్శవంతమైన రాష్ట్రంగా మారుతుంది. ప్రజలకు మెరుగైన వసతులు చేరువ అవుతాయి. వైద్య, విద్య, వ్యాపార, వాణిజ్య రంగాలలో పరుగులు తీసి భవిష్యత్ తరాలకు బంగారు బాట వేస్తుంది.




**జీ. వెంకటరమణ**
**సీనియర్ జర్నలిస్ట్**

# నివురుగప్పిన నిప్పులా పోడు దురాక్రమణ



**రాష్ట్రంలో పోడు భూముల దురాక్రమణలు శృతిమించిపోయాయి. చీమలు దూరని చిట్టడవుల్లో చెట్ల నరికివేత యధేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రికి రాత్రే అడవులు మాయమై సాగు భూములుగా దర్శనమిస్తున్నాయి. లెక్కా పత్రం లేకుండా గుత్తికోయలు, గోండ్రు జాతుల ముసుగులో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు చొరబడి విచ్చలవిడిగా అటవీ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. అధికారులు సర్వేకు వస్తే. డబ్బులి అమాయక ప్రజలను ఉసిగొలుపుతున్నారు. కొమురంభీం జిల్లాలో ఈ నెల గడిచిన 9న చింతల మానేపల్లి, బండేపల్లి, అర్జెల్లి అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులకు, పోడు రైతులకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. అక్కడ 2వేల ఎకరాల పైచిలుకు భూములు పోడు రైతుల పేరుతో దురాక్రమణకు గురైనట్లు తెలుస్తోంది.**



అటవీహక్కుల చట్టం వచ్చిన తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4.98 లక్షల ఎకరాల పోడు భూమి ఉన్నట్లు ప్రభుత్వం నిర్ధారించింది. 57వేల 831 రైతులు అటవీ హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పోడు వ్యవసాయం పెరగడమే ఘర్షణలకు కారణమని అటవీశాఖ వాదిస్తోంది. రాష్ట్రంలో 2006లోనే 91 వేలకు పైగా పోడు భూముల సాగు దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించింది. వాటి విస్తీర్ణం అప్పుడు 3 లక్షల 20వేల ఎకరాలకు పైగా ఉంది. మరో 50 వేల ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి, ఇంకో 15 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. వాటితో పాటు అదనంగా మరో 3 లక్షలకు పైగా ఎకరాల్లోనూ ఈ వివాదాలున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే.. గతంలో దరఖాస్తులు తిరస్కరించినప్పటికీ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకపోవడం ఇప్పుడు సమస్యగా మారిందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఆర్వోఎస్ఆర్ హక్కు దక్కాలంటే చట్టం వచ్చిన 2005 డిసెంబర్ 13వ తేదీకి ముందు 3 తరాలు 75ఏళ్ల పాటు ఆ భూములను సాగు చేసుకుంటూ ఉండాలి. 2005 నుంచి ఇప్పటి వరకు మరో 17 ఏళ్లు అదనం. ఒక్కొక్కరికి గరిష్టంగా 4 హెక్టార్ల వరకు సాగు చేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉంటుంది. రానురానూ గిరిపుత్రులు ఆక్రమిస్తున్న పోడు భూముల ఇస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు తమకూ పట్టాలు కావాలంటున్న వారి సంఖ్య సరాసరిగా 16 లక్షల పైచిలుకుకు చేరుకుంది. పట్టాలు ఇవ్వడమనేది వాస్తవమైతే గనుక తమ నుంచి బలవంతంగా లాక్కున్న పోడు భూముల్లో సైతం సర్వే చేయాలని సాగుదారులు డిమాండ్ చేస్తున్నారు. కానీ, ఈ పద్ధతి నిబంధనలకు విరుద్ధం అని అటవీశాఖ అధికారులు అంగీకరించడం లేదు. దీంతో పోడు భూముల సాగుదారులు రగిలిపోతున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 42 వేల 409 ఎకరాల్లో హక్కుల కోసం 18 వేల 295 మంది సాగుదారులు దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి జిల్లాలో 2లక్షల 60వేల 474 ఎకరాల్లో పోడు హక్కుల కోసం 82వేల 621 దరఖాస్తులొచ్చాయి. ఉభయ జిల్లాల్లో ఇప్పటి వరకు దాదాపు 70శాతం పోడు సర్వే పూర్తయింది. అయితే.. ఈ సర్వేలో చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురికావడం సాగుదారుల్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

అలాగూ లింగాపూర్, మామిడిపల్లి, వంజారీగూడ తదితర ప్రాంతాల్లో పోడు భూముల సర్వేను అడ్డుకుని అధికారులను అతిమికొట్టారు. తాజా పరిణామాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తే, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణాలో పోడు భూముల వివాదం గుత్తికోయలు, ఆటవీ అధికారుల మధ్య అగ్గి రాజేస్తోంది. పట్టాలు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన సమస్యను వంద రెట్లు జటిలం చేసింది. దాదాపు 20 ఏళ్ల క్రితమే ఉత్పన్నమైన ఈ సమస్య పరిష్కారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2016 నుంచి పోడు భూములపై కొండ జాతుల ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో రేవంత్ సర్కారు లెక్కలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. పట్టాల పంపిణీ అటుంచి కనీసం సర్వే చేయడానికి కూడా అధికార యంత్రాంగం ముందుకు కదలలేని స్థాయిలో ప్రతికూల పరిస్థితులు వెంటాడుతున్నాయి. వేల కిలోమీటర్ల పొడవునా అడవుల్లో అప్రకటిత అలజడి కొనసాగుతోంది. సుమారుగా ఐదారు జిల్లాల్లో మాత్రమే ఈ సమస్య ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, ఇప్పటికే 11 జిల్లాలకు పోడు భూముల సమస్య విస్తరించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలు అత్యంత సమస్యాత్మకంగా తయారయ్యాయి. ప్రభుత్వం నుంచి ఇంకా తాత్సారం చేస్తే గనుక కొండజాతులు, గుత్తికోయలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. అందుకు ప్రతిపక్షాలు అజ్యం పోస్తున్నాయి.

వాస్తవానికి అటవీ శాఖకు, కొండ జాతులకు మధ్య 2010లోనే ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. గడిచిన పదేళ్ళ కాలంలో వందల సార్లు దాడులు జరిగాయి. రక్తం చిందినా, ప్రాణం పోయినా వెనుకడుగు లేదన్న హెచ్చరికలు ప్రభుత్వానికి అందాయి. నేటికీ అదే పట్టుదలతో భూ పోరాటం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గత ఏడాది 16 ఘటనలు, పరస్పర దాడులు జరిగాయి. ఈ ఏడాది కూడా అవి కొనసాగుతున్నాయి. అంతకు ముందు (గత ప్రభుత్వంలో) కోయజాతుల నుంచి ప్రభుత్వానికి విప్లవోద్యమ ప్రతికూలత ఎదురైంది. పోలీసులు, అటవీ అధికారుల దాడుల్లో పోడు భూములను సాగు చేసుకుంటున్న వందలాది మంది గిరిపుత్రులు తీవ్రంగా గాయపడ్డారు. 2022 నవంబర్లో గుత్తికోయల తిరుగుబాటుకు ఓ ఉన్నతాధికారి బలైన విషయం తెలిసిందే. తాజాగా పోడు పట్టాల పంపిణీ ప్రభుత్వానికీ, అధికార యంత్రాంగానికీ కొరకరాని కొయ్యలా తయారైంది. మా జోలికొస్తే, కబర్దార్ అంటూ, కత్తులు నూరుతున్న గుత్తికోయలను ఏ కోణంలోనూ నియంత్రించలేని పరిస్థితి కనిపిస్తోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అడవుల్లోకి వెళ్లేందుకు ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. తమకూ ఆయుధాలు ఇవ్వాలని గత ఏడాది నవంబర్లో అడిగితే నేటికీ రెస్పాన్స్ రాలేదు. ప్రభుత్వం వద్ద ఉన్న లెక్కల ప్రకారం గరిష్టంగా 12 లక్షల ఎకరాల్లో పోడు భూములున్నాయి. గిరిజనుల అదుపులో ఉన్న భూమి 36 లక్షల ఎకరాల పైమాటేనని అధికారులంటున్నారు. ప్రతిఏటా పోడు సాగు విస్తీర్ణం విపరీతంగా పెరుగుతోంది. అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. ఆదివాసీ గిరిజనులు ఏజెన్సీల్లో పోడు భూములను నమ్ముకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. వాటిని అటవీ అధికారులు గిరిజనుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామం సాగుదారులకు ఆగ్రహం తెప్పిస్తోంది. వివాదాలు ముదిరిన చోట పోడు రైతులు అటవీ అధికారులను నిర్బంధిస్తుంటే.. అటవీశాఖ పోడు సాగుదారులపై కేసులు నమోదు చేస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏళ్లుగా పోడు భూముల వివాదం రగులుతూనే ఉంది.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష 10వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లాలో 63 వేల 77 ఎకరాల అటవీ భూమిని గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేస్తున్నారు. ములుగు జిల్లాలో 92 వేల ఎకరాల భూమి సాగులో ఉంది. వీటికి తోడు గొత్తికోయ గిరిజన గూడాలు 74 దాకా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో 34 వేల 884 దరఖాస్తులొచ్చాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పోడును అడ్డుకునే క్రమంలో అధికారులపై సాగుదారులు దాడులకు తెగబడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి 2,99,478 ఎకరాల అటవీ భూములకు క్లెయిమ్లు వచ్చాయి. పోడు సాగుకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హమైనవి 37వేల ఎకరాలుగా జిల్లా అటవీ అధికారులు మొదట్లో ప్రతిపాదించారు. ఈనెల 9న ఉన్నతాధికారి ఒకరు అక్కడికి వెళ్లి వచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో 1.32,000 ఎకరాల అటవీభూములు అటవీ హక్కు పత్రాలు ఇచ్చేందుకు అర్హమైనవిగా తేల్చారు. అలాగే నాగర్కర్నూల్ జిల్లాలో 313 దరఖాస్తులకు సంబంధించి 544 ఎకరాల అటవీభూమి అర్ధమైందిగా అధికారులు ప్రతిపాదిస్తే తాజాగా ఆ దరఖాస్తులు 1,972కి, అటవీభూమి ఐదువేల ఎకరాలకు పైగా పెరిగాయి. గిరిజన, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఈనెల 8న ఆ జిల్లాకు వెళ్లివచ్చాక ఈ సంఖ్య పెరిగింది. కరీంనగర్ జిల్లాలో కేవలం 27 దరఖాస్తులే అర్హమైనవిగా లెక్కతేలింది. తాజాగా 1,698 క్లెయిమ్లకు సంబంధించి మూడువేల ఎకరాలకు పైగా అటవీభూమి పోడు సాగుకు అర్హమైందిగా తేల్చారు. ములుగు జిల్లాలో మొత్తం 34,082 దరఖాస్తుల్లో అర్హమైనవి మొదట 2,200గా తేల్చగా తర్వాత ఆరు వేలకు, అటవీభూమి 5వేల ఎకరాల నుంచి 15,050 ఎకరాలకు పెరిగింది.

కామారెడ్డి జిల్లాలో అరమైన దరఖాస్తులు 1,200 నుంచి 7వేలకు పెరిగాయి. ఆదిలాబాద్ జిల్లాలో అర్హమైన దరఖాస్తులు 2,200 నుంచి 8,400కు.. అటవీ భూమి 4,600 ఎకరాల నుంచి 21 వేలకు చేరుకున్నాయి. ములుగు జిల్లాలో 5 వేల ఎకరాల అటవీ భూములకు అటవీహక్కు పత్రాలు ఇవ్వాలని తొలుత అనుకోగా తాజాగా ఆ సంఖ్యను 15 వేల ఎకరాలకుపైగా పెరిగిపోయాయి. ఇవన్నీ అధికారిక లెక్కలే.. అనధికారిక లెక్కలు ఈ సంఖ్యకు పదింతలు పెరిగాయి. అడవుల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొన్న గొత్తికోయలతో ఘర్షణలు, అటవీ అధికారుల ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతోంది. పోడు వ్యవసాయం, వన్య ప్రాణుల వేట జరుగుతోందని చాలాసార్లు వారిని మైదాన ప్రాంతాలకు తరలించాలని ప్రయత్నం చేసినప్పటికీ అధికారులు విఫలమయ్యారు. పోడు సాగుదారులు గొడ్డళ్లు, కర్రలతో దాడులకు తెగబడుతుంటే, అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్ల నుంచి వీరి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోడుపట్టాల పంపిణీ కోసం గ్రామ కమిటీ నుంచి డివిజినల్ కమిటీకి, అక్కడి నుంచి జిల్లా కమిటీకి హక్కు ప్రతిపాదనలు పంపుతారు. గిరిజన సంక్షేమ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఈ కమిటీల్లో ఉంటారు. జిల్లా కమిటీ దాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయి పరిశీలనలో అటవీ అధికారులు శాటిలైట్ మ్యాపులు, సాంకేతిక అంశాలను వినియోగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల్లో ప్రజాప్రతినిధులు ఉండడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో అధికారులతో కసరత్తు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లోని 2వేల 845 గ్రామ పంచాయతీల నుంచి 4లక్షల 14వేల 353 దరఖాస్తులు ప్రభుత్వానికి వచ్చాయి. వారు పట్టాలు కోరుతున్న భూమి విస్తీర్ణం 12లక్షల 46 వేల 846 ఎకరాలు, మరోవైపు అన్ని జిల్లాల్లోనూ పోడుభూముల సర్వే పూర్తిచేసి, పట్టాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పోడు సమస్యను పరిష్కరించి 11 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

**(రాజేష్ జైన్ నిడార్కర్)**
**- సీనియర్ జర్నలిస్ట్**



## పాలకుర్తి మాజీ సర్పంచ్ ఆసం లింగయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పాలకుర్తి, జూన్ 24 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆసం లింగయ్య ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసం లింగయ్య మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో లింగయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం పాలకుర్తి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ మరియు తాను వ్యక్తిగతంగా వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మెరుగు అశోక్ గౌడ్ , ఉపాధ్యక్షుడు నూకల గట్టయ్య, మాది ఎంపిటిసి దేవనందల రాజమౌళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంజపూరి సురేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్ లో కల్తీ పచ్చళ్ల కలకలం

- కల్తీ పచ్చడి తయారీ కేంద్రం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి
- ఒకరి అరెస్ట్, రూ.2.25 లక్షల విలువైన కల్తీ నిల్వలు స్వాధీనం



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ నగరంలో నిత్యవసర వస్తువుల తో పాటు ఆహార పదార్థాలు కల్తీ తయారీకి కేంద్రంగా మారుతోంది. వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో కొంతమంది స్వార్థపరులు వ్యాపారం పేరుతో కుళ్లిపోయి బూజు పట్టిన పదార్థాల తో పచ్చడి తయారీ చేసి అక్రమంగా నిల్వ ఉంచారని విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం అక్రమంగా నిల్వ ఉంచిన పచ్చల కేంద్రం పై మెరుపు దాడి నిర్వహించారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున కుళ్లిపోయిన పచ్చడి ముడిసరుకులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వాటిని చిన్న ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి స్థానిక కిరాణా దుకాణాలు, ఇతర చిన్న వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో అరికెల శ్రీనివాస్ (51), కాశీబుగ్గ నివాసిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 750 కిలోల టమోటా, 900 కిలోల మామిడి, 200 కిలోల నిమ్మకాయలు, 100 కిలోల ఉసిరికాయలు, 150 కిలోల అల్లంవెల్లుల్లి పేస్ట్‌తో కూడిన మొత్తం రూ.2,25,000 లక్షల విలువైన కుళ్లిపోయిన, కల్తీ ఆహార నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు బ్రాండ్ లేని లేదా అనుమానాస్పద ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. ఇలాంటి అక్రమ నిల్వ కేంద్రాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ దాడిని ఏసీపీ టాస్క్ ఫోర్స్ ఎ. మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్ మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు.



## ఎక్లాస్‌పూర్‌లో ఘనంగా 'ఇందిరమ్మ' గృహప్రవేశం

**రామగుండం,జూన్ 24 మహా** రామగుండం నియోజకవర్గం, అంతర్గాం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో పేదల సొంతింటి కల సాకారమైంది. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మించిన నూతన గృహాల ప్రవేశ ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జూపాక మమతశ్రీనివాస్, ఉపసర్పంచ్, మండల పోరం అధ్యక్షులు లగిశెట్టి రాకేష్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బరుపటి తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లబ్ధిదారులు గుమ్మడి భ్యాగలక్ష్మివేంకన్న దంపతుల గృహాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మమతశ్రీనివాస్, మండల పోరం అధ్యక్షులు లగిశెట్టి రాకేష్ మాట్లాడుతూ.ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేకమంది పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది అని పేర్కొన్నారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు వారు నూతన వస్త్రాలను అందించి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



## మెటీరియల్ గేట్ వద్ద ప్రమాద ఛాయలు

**ఎన్టీపీసీ, జూన్ 25 (మహా)**: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ సమీపంలో రోడ్డు పక్కన పెరిగిన చెట్లు ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే తొలగించాలని కాంట్రాక్టు కార్మికులు అధికారులను కోరుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ 4 వేల మందికి పైగా కార్మికులు విధులకు రాకపోకలు సాగిస్తున్నారు.గోదావరిఖని-కరీంనగర్ ప్రధాన రాజీవ్ రహదారిపై ఉన్న చెట్ల కొమ్మలు రహదారికి అడ్డంగా విస్తరించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించడం లేదని కార్మికులు తెలిపారు. గోదావరిఖని వైపు నుంచి వచ్చే వాహనాలు, మెటీరియల్ గేట్ నుంచి బయటకు వచ్చే వాహనాలు అకస్మాత్తుగా ఎదురుపడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు కార్మికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొంటూ, సంబంధిత అధికారులు, హెచ్‌కేఆర్ (HKR) సిబ్బంది తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రహదారిపై స్పష్టమైన దృశ్యమానత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.

## సహచర ఉద్యోగి కుంటుంబానికి అండగా అగ్రిటెక్

### రూ.లక్ష ఉద్యోగి కుటుంబానికి అందజేసిన అధినేత

**మహా వరంగల్ బ్యూరో;** తమతో ఆత్మీయంగా కలిసి మెలిసిన మిత్రుడు అకస్మాత్తుగా కానరాని లోకాలకు వెళ్లడం సహచర ఉద్యోగులను ఎంతగానో కలిచివేసింది. తమ ఆత్మీయుడి కి అండగా నిలవాలని దృఢంగా నిర్చయించుకుని వారు బాసటగా నిలిచారు. మన అగ్రిటెక్ సంస్థ ఉద్యోగి బోగ రాము ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించగా ఆ కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో మన అగ్రిటెక్ సంస్థ అధినేత పాశికంటి రమేష్ అలాగే వారి సిబ్బంది నిర్చయించుకుని అధినేత రమేష్ సహకారంతో అందరూ కలిసి లక్ష రూపాయలు తమ ఆర్థిక సహాయంగా అందించి అండగా నిలిచారు. గురువారం బోగ రాము దశదిన కర్మ సందర్భంగా అధినేత పాశికంటి రమేష్ వారి బృందం లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్ రూపంలో వారి కుటుంబ సభ్యులకు అందించి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమ ఆత్మీయుడిని కోల్పోవడం చాలా బాధగా ఉందని ఆయన లేని లోటు తీర్చడం ఎవరి వల్ల కాదని ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని అందించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు.





## స్కూల్స్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శారద

**మహా వరంగల్ బ్యూరో ;**ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కూలంకషంగా పరిశీలిస్తూ నిర్మాణంలో వాడుతున్న సిమెంట్ గ్రేడ్, ఇనుము నాణ్యత, ఇటుకల దృఢత్వం గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలను, ఎంత శాతం పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే అంశంపై కాంట్రాక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వర్షాకాల పరిస్థితుల వల్ల నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సిమెంట్ సెట్టింగ్, కురిసే వర్షం వల్ల మట్టి పని ఆలస్యం వంటి అంశాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పని చేయాలని సూచించారు. గడువులోగా నాణ్యమైన భవనం నిర్మించి విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**వలిగొండ జూన్ 25 మహా న్యూస్**

దళిత వాడల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి అన్నారు గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత లబ్ధిదారులకు అదనంగా 5 లక్షల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు



## సమగ్ర గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి బ్యూరో, మహా**: గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు మౌలిక సదుపాయాలు స్థానిక సమస్యలను గుర్తించి నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యచందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి, డి ఆర్ ఓ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజా అవసరాలు ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ పథకాల సమర్థ అమలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విద్యచందన, పంచాయతీ కార్యదర్శి ఎం. సాయి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీఓ సంధ్య శిక్షకులుగా పాల్గొని వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల డీఎల్‌పీఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి బ్యూరో, మహా**: విద్యార్థులు మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని ఇది సామాజిక రుగ్మత అని దీనిపై పోలీసులతో పాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని క్రీడలు కళలు సాంస్కృతిక కార్యక్రమాలు వంటి సానుకూల ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను డ్రగ్స్ రహిత భద్రాద్రిగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ధైర్యంగా తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి ట్రాప్, ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని హెల్మెట్ వినియోగం సీటు బెల్ట్ ప్రాధాన్యత డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. సుమారు 1500మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి. రమణ, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్లు హెచ్.అబ్దుల్ రషీద్, బి.మరియధాసు, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా, పోలీస్ అధికారులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ పరిశీలించిన చైర్‌పర్సన్ శ్రీవాణి

**యాదాద్రి భువనగిరి, జూన్ 25 (మహా)**: భువనగిరి మున్సిపాలిటీలో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ గురువారం పరిశీలించారు. రవికుమార్ గంజ్ ప్రాంతంలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆమె, ప్రతి ఓటరు తమ పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. రెండు చోట్ల ఓటు నమోదు ఉండకుండా చూసుకోవాలని, అధికారులు కోరిన వివరాలను అందించి సవరణ ప్రక్రియకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్ ముందు నిరసనతెలిపిన స్వర్ణకారులు



**యాదాద్రి భువనగిరి జూన్ 25 మహా** స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. దొంగ బంగారం పేరుతొ పోలీసులు తమపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. అన్ని కార్పొరేషన్ వారికీ ఇస్తున్నట్లు వంటి పెన్షన్లు తమకు కూడా నెలకు ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి స్వర్ణకారుడికి ఐదు లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొండపర్తి బాలచారి, ప్రధాన కార్యదర్శి సంతోష్, కోశాధికారి గిరిధర్ చారి, ఆయా మండలాల, పట్టణాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, స్వర్ణకార సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోండి

**బూర్గంపహాడ్, మహా:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సీపీఎం బూర్గంపహాడ్ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. ఓటర్ల నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.సారపాక ముత్యాలంపేటలో నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బూత్ ఏజెంట్లుగా బత్తుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు వైబుల్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలు తమ నివాసాల వద్దే ఉండి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు పూర్తి చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో ఓటు వేసినందున పేరు జాబితాలో కొనసాగుతుందనే భావన సరైంది కాదని, ఈ సర్వేలో గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారి పేర్లు కూడా తొలగిపోయే అవకాశం ఉందని వెంకటేశ్వర్లు తెలిపారు. 2002 నాటి నమోదులను ఆధారంగా చేసుకుని సర్వే నిర్వహిస్తున్నందున ప్రస్తుతం వివరాలు సరిచేసుకోకపోతే భవిష్యత్తులో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. డబుల్ ఓట్లు తొలగించడం, ఇతర ప్రాంతాలకు మారిన వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోనే ఓటు నమోదు చేసుకోవడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం వంటి అంశాల్లో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ఎన్నికల అధికారుల బాధ్యత అని, తెలంగాణ ప్రభుత్వం కూడా అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు సారపాక, వసంత మేడే కాలనీ, ముత్యాలంపేట, రిక్షా కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన నమోదు, సవరణలు వెంటనే పూర్తి చేసుకోవాలని సీపీఎం నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.






## ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

- **ఇంటింటి సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో**: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడానికి వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ పనితీరును పరిశీలించిన కలెక్టర్, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సేవలను ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**ఇంటింటి సర్వే పరిశీలన**

బుధవారం ప్రారంభమైన ఇంటింటి ఎస్ఐఆర్ సర్వేను కొత్తవాడ లో జరుగుతున్న ఇంటింటి సర్వే ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న ఒక ఇంటిని సందర్శించి బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)ను అడిగి సర్వే విధానం, వివరాలను తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటర్ ను గుర్తించాలని సూచించారు.ఎస్ఐఆర్ సర్వే విజయవంతం కావడానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్, వరంగల్ తాసిల్దార్ శ్రీకాంత్, బీఎల్వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## స్కూల్స్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శారద



**మహా వరంగల్ బ్యూరో ;**ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కూలంకషంగా పరిశీలిస్తూ నిర్మాణంలో వాడుతున్న సిమెంట్ గ్రేడ్, ఇనుము నాణ్యత, ఇటుకల దృఢత్వం గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలను, ఎంత శాతం పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే అంశంపై కాంట్రాక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వర్షాకాల పరిస్థితుల వల్ల నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సిమెంట్ సెట్టింగ్, కురిసే వర్షం వల్ల మట్టి పని ఆలస్యం వంటి అంశాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పని చేయాలని సూచించారు. గడువులోగా నాణ్యమైన భవనం నిర్మించి విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి...**

**రాజేంద్రనగర్ మహా;** డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు యువత మద్దతుగా నిలిచి పోలీసులకు సహకరించాలి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాంని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన పరిచి లక్ష్యంతో శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ఫీచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటంతో వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోందన్నారు. ఎన్ డి పిఎస్ చట్టం కింద కఠినాతి కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలుపాలన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ సాధనలో యువత విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడితే వ్యక్తిగత జీవితం తో పాటు కుటుంబాలు నాశనం అవుతాయి అన్నారు. డ్రగ్స్ రవాణా చేయడం వినియోగించడం రెండు కూడా నేరమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఈగల్ ఫోర్స్ ఎస్సైలు గిరిధర్, సీతారాం, చేవెళ్ల ఏసిపి కిషన్,శంషాబాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ పర్యటనను విజయవంతం చేయాలి...

**బిజెపి డివిజన్ అధ్యక్షులు...**

**రాజేంద్రనగర్ మహా ;** కాటేదా న్ బిజెపి కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు సూర్ రెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకుల సన్నాక సమావేశం గురువారం నిర్వహించారు. సన్నగా సమావేశంలో డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ ఆదివారం తెలంగాణ పర్యటన కు రానున్న బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కు శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ లో బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా స్వాగతం పలకాలన్నారు. రంగారెడ్డి జిల్లా బిజెపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ పర్యటనను విజయవంతం చేయాలని బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జోగు రవి,అడికే రాజు, బల్ల శ్రీనివాస్ యాదవ్, శ్రవణ్ కుమార్, అంజి, కొండల్, రామకృష్ణ, రాజేష్ కుమార్, అరుణ్ కుమార్, రాజ్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కు శ్రీకారం



**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 25 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీ డి ఎం ) అమలులో మోడల్ డిస్ట్రిక్ట్గా ఎంపికైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ఏ బి డి ఎం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ ( హెచ్ ఎఫ్ ఆర్ ) మరియు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ ( హెచ్పిఆర్ ) నమోదులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, ఫార్మసీలు మరియు వైద్య నిపుణులందరూ ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు మరియు ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా హెచ్ ఎఫ్ ఆర్, హెచ్ పి ఆర్ నమోదులు పూర్తి చేయాలని సూచించారు. వైద్యులచే జారీ చేయబడే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య రికార్డుల డిజిటల్ నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఏబీడీఎం అమలును పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కమిటీలు, ఫీల్డ్ బృందాలు ఏర్పాటు చేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు వారాల్లో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన ఆరోగ్య సంస్థలు, వైద్య నిపుణుల నమోదులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఏ బి డి ఎం ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులు సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రతి పౌరునికి ఏ బి హెచ్ ఎ ఐ డి రూపొందించడం ద్వారా వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో అనుసంధానం చేయవచ్చు. రోగి అనుమతితో దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఏ బి డి ఎం నమోదిత ఆసుపత్రిలోనైనా గత వైద్య చరిత్ర, పరీక్షా నివేదికలు, ప్రిస్క్రిప్షన్లు మరియు ఇతర ఆరోగ్య వివరాలను పరిశీలించి, వేగవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. దీంతో కాగితపు రికార్డుల అవసరం తగ్గి, అత్యవసర పరిస్థితుల్లో కూడా చికిత్స మరింత సమర్థవంతంగా అందుతుంది. రోగి అనుమతి లేకుండా ఆరోగ్య వివరాలను ఎవరూ చూడలేరు; గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుంది. ఈ సమావేశంలో డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జెడ్.పి.సి.ఇ.ఓ. శోభరాణి ఏబీడిఎం నోడల్ అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఎబిడిఎం స్టేట్ ట్రైనర్ సాయి కుమార్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సార్)ను గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నిరేటి మహేష్, బిఎల్వేలతో కలిసి గురువారం ప్రారంభించారు.అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలి సవరణలను వివరాలను పారదర్శకంగా చేపట్టాలని సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ బీఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొంట అశోక్, వార్డు సభ్యులు చౌట రాజు, పర్వతం వెంకటయ్య, కనకమామిడి విష్ణు, లింగం సంధ్య, నవీన్, పర్వతం వినోద్, గూడెపు నీరజ, లక్ష్మణ్, పులిమామిడి షాలిని, శ్రీకాంత్, కర్రె అఖిల, గణేష్, కుమార్ గౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసిల్దార్ దశరథ

**వలిగొండ జూన్ 25 మహా న్యూస్** ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ఓటర్ నమోదు పరిశీలన కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని నాగారంలో బి ఎల్ ఓ చేపట్టిన ఇంటింటి ఓటర్ నమోదు పరిశీలన కార్యక్రమాన్ని తహసిల్దార్ దశరథ పరిశీలించారు తహసిల్దార్ దశరథ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కల్పించేందుకు ప్రతి ఇంటికి బిఎల్వోలు రావడం జరుగుతుందని తమ ఓటు ఉన్నదా లేదా అని సరిచూసుకోవడం తప్పనిసరి అని అన్నారు



## మొహారం వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యేబీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 25 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో గురువారం నిర్వహించిన మొహారం పండుగ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులు, యువకులు మరియు పెద్దలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.మొహారం పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్ల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే సంప్రదాయబద్ధంగా పీర్లకు దట్టీలను సమర్పించి తన భక్తి, గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సమాజంలో సామరస్యం, సోదరభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మొహారం పండుగ త్యాగం, ధర్మం మరియు మానవతా విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సహనం మరియు ఐక్యతతో జీవించడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మొహారం వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.






## అజంజాహి మిల్లు భూముల వేలం పాటను అడ్డుకుంటాం

**కార్మిక సంఘాల హెచ్చరిక**

**హా వరంగల్ బ్యూరో:** మాడిఫైడ్ వాలంటరీ రిటైర్మెంట్ 2002 వర్కర్స్ యూనియన్ నేతలు అజంజాహి మిల్లు భూముల వేలం పాటను నిరసిస్తూ అజంజాహి మిల్లు గ్రౌండ్ వాటర్ ట్యాంక్ వద్ద గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కి రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని అజంజాహి మిల్లు కార్మికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 318 మంది కార్మికులకు మిల్లు స్థలంలోనే భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేపు అనగా జూన్ 26 జరగబోయే వేలం పాటలను అడ్డుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేత గంగుల దయాకర్, టీపీఎఫ్ నాయకులు కంపెల్లి ప్రవీణ్, ఏపీ సీఎల్‌సీ నేత దాసు తదితరులు ఈ సమావేశంలో పాల్గొని మద్దతు పలికారు.




## జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా వనంపల్లి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ఏఐటీయూసీ 4 వ మహాసభల్లో రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా వనంపల్లి జైపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సభ్యులు పాలమాకుల జంగయ్య, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రామస్వామి, కార్యదర్శిలు సత్యనారాయణ, మల్లేష్, శేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి నర్రగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డికి ఎల్ఐటి హోటల్లో గురువారం శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు రామకృష్ణ, షకీల్ గిలక రాజు, నరేష్ నాయక్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన విప్ అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, జూన్ 25 (మహా):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు.పట్టణంలోని 142, 144 పోలింగ్ బూత్‌లను సందర్శించిన అయిలయ్య, సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాల పరిశీలన చేపట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సకాలంలో సవరించాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితానే ఎన్నికల ప్రక్రియకు పునాదని పేర్కొన్న ఆయన, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలకమని అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించిన అయిలయ్య, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

- **టీబీ నిర్మూలనకు పటిష్ట కార్యాచరణ చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్ష**

**హనుమకొండ మహా:** మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. అదే విధంగా టీబీ రహిత సమాజం లక్ష్యంగా టీబీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో టీబీ ముక్త్ భారత్, నషా ముక్త్ భారత్, సంకల్ప్ కార్యక్రమాల అమలు పై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద నిర్వహిస్తున్న కార్యక్రమాలు, హైరిస్క్ వర్గాల వారికి చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలు, టీబీ బాధితులకు అందిస్తున్న చికిత్స, నిక్షయ్ పోషణ యోజన, దాతల సహకారంతో పంపిణీ చేస్తున్న పోషకాహార కిట్లు, 100 రోజుల ప్రత్యేక టీబీ నిర్మూలన ప్రచార కార్యక్రమం తదితర అంశాల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసు శాఖ, ఈగల్ బృందం, రెడ్‌క్రాస్ సొసైటీ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో నషా ముక్త్ భారత్, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాలపై సమగ్ర అవగాహన ప్రజెంటేషన్ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కఠిన చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాల బారినపడిన వారికి పునరావాస కేంద్రాల ద్వారా అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లాలో టీబీ అధికంగా నమోదవుతున్న 25 హైరిస్క్ గ్రామాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో మరింత విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించి పూర్తిస్థాయిలో కోలుకునేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంకల్ప్ కార్యక్రమం కింద నవజాత శిశు మరణాలను మరింత తగ్గించి సింగిల్ డిజిట్ స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వెయ్యి సజీవ జననాలకు సగటున 13.8 నవజాత శిశు మరణాలు నమోదవుతుండగా, హనుమకొండ జిల్లాలో 9,683 జననాలకు కేవలం 30 మరణాలు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. నవజాత శిశువులు, బాలింతలకు మరింత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గృహ సందర్శనల సమయంలో తల్లులు, శిశువులను తప్పనిసరిగా పరిశీలించి శిశు సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన బకల్పించాలని సూచించారు. సమిష్టి కృషితోనే మత్తు రహిత, టీబీ రహిత, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ.వి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఏఈఓ గోపాల్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రజిత, డాక్టర్ మురళి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రుబీనా, డాక్టర్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సీయంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంద ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి తో కలిసి లబ్దిదారులకు అందించారు. మొత్తం 12లక్షల80వేల విలువగల చెక్కులు అందించినట్టు తెలిపారు. అలాగే తన క్యాంపు కార్యాలయం ద్వారా ఇప్పటివరకు మొత్తం 3కోట్ల 40 లక్షలకు పైగా విలువ గల చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్ ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ ,నాయకులు కొండ గంగాధర్, షాహిద్ అలీ, సుధాకర్ గౌడ్, అన్నపూర్ణ, మహబూబ్ అలీ,రఫీక్, ఎంఏ షకీల్ , మునిగెల విఠల్,అల్చెట్టి నాగన్న, మంచాల మల్లయ్య, రావుల సోమన్న ,సుకేందర్ , బెల్లూరి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి ప్రజాదర్బార్

- ఆయన క్యాంపు కార్యాలయం లో కార్యక్రమం
- పలు సమస్యలపై దరఖాస్తులిచ్చిన ప్రజలు
- పరిష్కారానికి కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి హామీ



**ఆదిలాబాద్ మహా** : నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవరమొచ్చినా తాను అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుండి తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదర్బార్ లో తమ సొంత సమస్యలు , గ్రామ సమస్యలు, వార్డు, కాలనీల సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. తమ సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్లికేషన్ల డాటాను ఎప్పటికప్పుడు భద్రపరిచి క్లీయరెన్స్ అప్డేట్ తెలుసుకునే అవకాశముందన్నారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం శాయ శక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందించవచ్చన్నారు. వాటి పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ ,సీనియర్ నాయకులు దిగంబర్ రావు పాటిల్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ , షాహిద్ అలీ, సుధాకర్ గౌడ్, అన్నపూర్ణ, మహబూబ్ అలీ,రఫీక్, ఎంఏ షకీల్ , మునిగెల విఠల్,అల్చెట్టి నాగన్న,సుకేందర్ , బెల్లూరి రాంరెడ్డి పాల్గొన్నారు.



# డ్రగ్స్ బారిన పడొద్దు

- ప్రజలకు అవగాహన కల్పించిన ఆలేరు సిఐ యాలాద్రి

**యాదాద్రి భువనగిరి జూన్ 25 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బస్టాండ్ సమీపంలో ప్రజలకు డ్రగ్స్ బారిన పడొద్దని ఆలేరు సిఐ యాలాద్రి గురువారం అవగాహన కల్పించారు... జూన్ 26 అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా సిఐ డ్రగ్స్ వాడడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు.. గ్రామాల్లో గంజాయి డ్రగ్స్ పై అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు.. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు



# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ మహా : మాదకద్రవ్యాల ముప్పు నుండి యువతను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'మిషన్ పరివర్తన్ నషా ముక్త్ భారత్ సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అంతకుముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి జడ్పీ సమావేశ మందిరం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీనీ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యసనానికి బానిసైతే బంగారు భవిష్యత్తు చిన్నాభిన్నం కావడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులను మార్చేందుకు 'డవ్' స్వచ్ఛంద సంస్థ, రిమ్స్ ఆసుపత్రి వేదికగా డీఅడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే రైతు భరోసా, రుణమాఫీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేస్తామని, ఇప్పటికే పలువురు నిందితులకు లబ్ధిని నిలిపివేశారని చేశామని స్పష్టం చేశారు. గతంలో ఉన్న నక్సలిజం కంటే ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారి రూపంలోనే పెద్ద ముప్పు పొంచి ఉందన్న డీజీపీ మాటలను ఆయన గుర్తుచేశారు. దీనిని అడ్డుకునేందుకు గ్రామ స్థాయిలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఆరోగ్య పాఠశాల విధానంలో భాగంగా ప్రతి గురువారాన్ని డ్రగ్స్ వ్యతిరేక అవగాహన దినంగా కేటాయించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, అవసరమైతే పోలీస్, సంక్షేమ శాఖల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించాలని, జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.అనంతరం నషా ముక్త్ భారత్ భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసి, డవ్ పునరావాస కేంద్రంలో మార్పుపొందిన బాధితుల కుటుంబాలను కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వైద్యారోగ్యశాఖ అధికారి సాధన, కౌన్సిలర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, యువత, విద్యార్థులు, అంగన్వాడిలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# తన ఓటు వివరాలు పరిశీలించిన కలెక్టర్

- ఫామ్ బీఎల్వో కు అందజేత
- అందరూ ఎఐఆర్ ప్రక్రియకు సహకరించాలి

**ఆదిలాబాద్ మహా:** ఓటర్ల జాబితాలో లోపాలను సవరించి, పారదర్శకమైన జాబితాను రూపొందించేందుకు 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇందులో భాగంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన స్వయంగా తన ఓటు వివరాలను పరిశీలించుకున్నారు. రీప్రింటెడ్ ఎన్యుమరేషన్ ఫామ్ ద్వారా తన ఓటు వివరాలను క్షుణ్ణంగా సరిచూసుకున్నారు. గతంలో 2002 ఓటర్ జాబితా ప్రకారం ఉన్న తన వివరాలను నమోదు చేసి, ఒక స్పష్టమైన ఫోటోను జతపరిచి బి.ఎల్.ఓకు అందజేశారు.ప్రస్తుతం తన ఓటు ఆదిలాబాద్‌లోనే ఉన్నప్పటికీ, 2002 లో తన తండ్రి నివాసమైన బీహార్‌లోని అరరియా జిల్లా, ఫార్బిస్‌గంజ్ నియోజకవర్గంలో ఉందన్నారు.. గతంలోనే దానికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసినందున.. ఇప్పుడు అదే వివరాలను ఫామ్‌లో నింపి బి.ఎల్.ఓకు అందజేసినట్టు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వస్తారని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ నేటి నుండి జూలై 24వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఓటర్లలో ఉన్న కొన్ని అపోహలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. తమ తల్లిదండ్రుల ఓట్లు వేరే రాష్ట్రాల్లోనో లేదా ఇతర జిల్లాల్లోనో ఉన్నాయని చెబితే, ఇక్కడున్న తమ ఓటు ఎక్కడ కట్ అయిపోతుందోనని కొందరు భయపడుతున్నారని.. అలాంటి అపోహలను అస్సలు నమ్మవద్దని ఆయన అన్నారు. అర్హులైన, నిజమైన ఓటర్ల ఓట్లు ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబడవని స్పష్టం చేశారు.ఎన్యుమరేషన్ ఫామ్స్ సమర్పించిన తర్వాత జూలై 31న 'డ్రాఫ్ట్ రోల్ ప్రచురించబడుతుందని తెలిపారు. అందులో 2002 డేటాబేస్ ప్రకారం వివరాలు నింపి ఇచ్చిన వారందరి ఓట్ల వివరాలు ఉంటాయని అన్నారు. సోషల్ మీడియాలో ఓట్ల తొలగింపు పై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. నిజమైన ఓటర్లందరూ తప్పకుండా ఈ ఎన్యుమరేషన్ ఫామ్ నింపి, అందులో తమ వివరాలతో పాటు తల్లిదండ్రులు, తాతయ్య, నానమ్మ లేదా గార్డియన్ల ఓట్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు.నింపిన ఫామ్‌లలో ఒక కాపీ ఓటర్ వద్ద భద్రంగా ఉంటుందని, మరొకటి బి.ఎల్.ఓకు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

# కొత్త పెన్షన్ల మంజూరు పై ప్రభుత్వం కీలక నిర్ణయం.!




**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బడ్జెట్ లో రెండు లక్షల కొత్త పెన్షన్లు అందిస్తామ ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, భారీ సంఖ్యలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు రావటంతో ప్రభుత్వం ఇప్పుడు వీటి ఖరారు పైన కసరత్తు చేస్తోందని సమాచారం. క్షేత్ర స్థాయి నుంచి దరఖాస్తులతో పాటు గా కొత్త వాటి కోసం లబ్దిదారులు వేచి చూస్తున్నారు. దీంతో.. కొత్త దరఖాస్తుల స్వీకరణ.. మంజూరు పైన తాజాగా మార్గదర్శకాలు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పంపిణీ ముహూర్తం పైనా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.కొత్త పెన్షన్ల కోసం వేచి చూస్తున్న వారికి తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. పెన్షన్ల కోసం అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సెర్ప్ అధికారులు సర్వే చేపడుతున్నారు. వచ్చే నెల నుంచి ఒంటరి మహిళలకు పెన్షన్లు అందిస్తామని ఇప్పటికే మంత్రి సీతక్క ప్రకటించారు. అయితే, తమకు అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వడం లేదని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతోంది. ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖరుతో సర్వే ముగియనుండగా.. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. వచ్చే నెల నుంచి పెన్షన్ల పంపిణీ కాగా.. నిజమైన లబ్ది దారులకు మాత్రమే పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ లైవ్ అథెంటికేషన్ సర్వే చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనర్హులను గుర్తిస్తోంది. రాష్ట్రంలో మొత్తం 42 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. వీరిలో బ్యాంక్ అకౌంట్లలో నేరుగా పింఛన్లు పొందుతున్నవారు 19,04,239 మంది ఉన్నారు. వీరిలో 93,624 మందిని అనర్హులుగా గుర్తించింది. 40,751 మంది మరణించగా. వీరి పేరిట ఇంకా నిధులు విత్ డ్రా అవుతున్నట్లు గుర్తించారు. 41,689 మంది ఆచూకీ లభించడం లేదు. 3,495 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా..11 వేల మంది ఆధార్లు చెల్లకపోగా.. వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ప్రస్తుతం 15.97 లక్షల మంది సర్వే పూర్తి చేశారు. కాగా.. ఇక నుంచి పెన్షన్లను నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# కాంట్రాక్టు కార్మికుల ధర్నా

**కనీస వేతనం రూ. 26,000/- చేయాలి: ఎన్టీపీసీ వద్ద సిఐటియు నిరసన**

**జ్యోతి నగర్, జూన్ 25 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం ఎన్ టి పి సి కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోను సవరించి, నెలకు 26,000 వేతనంగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ,సిఐటియు పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీపీసీ టీటీఎస్ గేట్ నుంచి ALC కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ALC మహమ్మద్ యూసఫ్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ ముత్యంరావు మాట్లాడుతూ.2012 నుండి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను వెంటనే చేపట్టాలని కోరారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సీఎల్, బసంత్ నగర్ సిమెంట్ తదితర పరిశ్రమల్లోని కాంట్రాక్టు కార్మికులు ధరల పెరుగుదలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని,కార్మికుల ప్రయోజనాలకు గండికొట్టే పీఎఫ్, ఈఎస్ఐ సీలింగ్‌లను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమార్ స్వామి, జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు, నాయకులు ఎన్. బిక్షపతి, గిట్ల లక్ష్మారెడ్డి, ఎండి యాసీన్, సిహెచ్ ఉపేందర్, ఎండి యాకుబ్, దండ రాఘవరెడ్డి, అక్కపాక శంకర్, బి. తిరుపతి, ఆడెపు రమేష్, సరళ, రాజు, కేతమ్మ, కనకలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ పై కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో అవగాహన





- హాజరైన బూత్ సూపర్ వైజర్లు , పార్టీ మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు
- బాధ్యతగా పనిచేయండి
- అర్హులది ఒక్క ఓటు కూడా పోవద్దు
- బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండేలా చూడండి
- బూత్ సూపర్ వైజర్లు , పార్టీ మండల అధ్యక్షుల పాత్ర కీలకం
- సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి సూచనలు సలహాలు

**ఆదిలాబాద్ మహా:** ఎస్ఐఆర్ తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్ష ఓట్లను టార్గెట్ గా చేసుకుని ఓట్ల తొలగింపునకు కుట్ర పన్నుతోందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు.గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బూత్ సూపర్ వైజర్లు , పార్టీ మండల అధ్యక్షులు ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. మన ఓట్లు కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఇందుకు బూత్ సూపర్ వైజర్లు , పార్టీ మండల అధ్యక్షులతో పాటు బీఎల్ఏ2 లది చాలా కీలక పాత్ర అన్నారు. ప్రతీ పది బూత్ లకు ఒక సూపర్ వైజర్ ను నియమించినట్టు తెలిపారు. ప్రజల ఓటు హక్కును మనం కాపాడాలన్నారు. నిరక్షరాస్యులు, పేదలు, గ్రామీణ ప్రజలకు సర్ పై అవగాహన కల్పిస్తూ ఓటు కోల్పోకుండా చూడాలన్నారు. గ్రామాలలో ఎన్నికల సమయంలో వ్యవహరించినట్టు ఇప్పుడు సర్ పై కూడా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్క అర్హులకు ఓటు వచ్చేలా చూడాలన్నారు. నాయకులు, బిఎల్ఏ2లు 2002 ఓటర్ లిస్ట్, 2025 లిస్ట్ పెట్టుకొని మ్యాపింగ్ చేయాలని.. అందరు బాధ్యతగా దీనిని నిర్వర్తించాలన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నియెజవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ , కంది మౌనా శ్రీనివాస రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా,కొండ గంగాధర్,, షాహిద్ అలీ, లోక ప్రవీణ్ రెడ్డి ,బండారి సతీష్,అన్నపూర్ణ పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న ఫ్లాష్ మాబ్

**ఆదిలాబాద్ మహా:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్ చౌక్ వద్ద డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పాఠశాల విద్యార్థులచే ఫ్లాష్ మాబ్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత భవిష్యత్తుపై వాటి ప్రభావం పై విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ జీవన్ రెడ్డి సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. విద్యార్థులు "డ్రగ్స్‌కు నో చెప్పండి", "జీవితానికి యెస్ చెప్పండి", "గంజాయి రహిత ఆదిలాబాద్ నిర్మిద్దాం" వంటి సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ వినూత్న ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని ప్రజలు ఆసక్తిగా వీక్షించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

# బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలి

**సిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**

**బెల్లంపల్లి, మహా:**బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలనీ ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు.గురువారం రోజు ఎం సి పి ఐ యూ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో కాంటానుండి మొదలు కొని ఏరియా ఆసుపత్రి వరకు కొనసాగిస్తున్న రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని రోడ్ల పనులు పూర్తికాక ప్రజలు అవస్థలుపడుతున్నారనీ రోడ్లమీద గుంతలు పడటం వల్ల ద్విచక్ర వాహనాదరులు,ఆటో డ్రైవర్స్ ఇబ్బందులకు గురి అవుతున్నా కూడా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్లు వ్యవహరించటం సిగ్గుచేటు అని ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ చెర్మన్, మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్లు మరమ్మ త్తులు చేయించాలని లేని యెడల పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎం సి పి ఐ యు పార్టీ పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, ఏం సిపిఐయూ పార్టీ మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, చింటూ, ఆకాష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం మరింత కొనే సమయం వచ్చిందా?



ప్రముఖ ఇన్వెస్టర్, ప్రపంచ ప్రఖ్యాత 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి బంగారం ధరలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బంగారం ధరలు వరుసగా తగ్గుముఖం పడుతుండటం మంచి వార్తేనని ఆయన తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. అయితే తాను ప్రస్తుతం మరింత బంగారం కొనుగోలు చేసే సమయం వచ్చిందా లేదా అన్నది తెలుసుకోవడానికి సాంకేతిక చార్టులను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ధరలు తగ్గుతున్నాయనే కారణంతోనే పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయం కాదని కియోసాకి అభిప్రాయపడ్డారు. ఒక ఇంటి ధర తగ్గితే కేవలం తక్కువ ధర చూసి కొనుగోలు చేయరని, ఆ ఇంటి చుట్టుపక్కల ప్రాంతం ఎలా అభివృద్ధి చెందుతోందో కూడా పరిశీలిస్తామని ఉదాహరణగా వివరించారు. అదే విధంగా బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి? ఆర్థిక వ్యవస్థలో ఏమి జరుగుతోంది? అనే అంశాలను తెలుసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు బలహీనపడుతున్నాయని భావిస్తే తాను బంగారం కొనుగోలుకు దూరంగా ఉండవచ్చని, కానీ ఆర్థిక వ్యవస్థ మెరుగుదల దిశగా సాగుతోందని సంకేతాలు కనిపిస్తే తక్కువ ధరల వద్ద బంగారాన్ని కొనుగోలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తానని చెప్పారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న బంగారంలో చాలా భాగాన్ని 2000 ప్రాంతంలో ఔన్స్‌కు సుమారు 300 డాలర్ల ధర వద్ద కొనుగోలు చేశానని కియోసాకి గుర్తుచేశారు. మార్కెట్ ధోరణి (ట్రెండ్)ను గమనించడం పెట్టుబడిదారులకు అత్యంత కీలకమని, ధరల కంటే వాటి వెనుక ఉన్న ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడమే విజయవంతమైన పెట్టుబడులకు మూలమని ఆయన తన పోస్ట్‌లో సూచించారు.

# మోదీని కలిసిన అమెజాన్ సీఈఓ: కీలక ప్రకటన!



ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా ఒకటి. అందుకే.. దిగ్గజ సంస్థలు భారత మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. తాజాగా అమెజాన్ కూడా అదే బాటలో మరో అడుగేసింది. అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ తన భారత పర్యటన సందర్భంగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా.. 2030 నాటికి భారతదేశంలో ఏఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణ కోసం అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే అమెజాన్ 2025 డిసెంబర్‌లో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. కొత్త పెట్టుబడులను ప్రకటించిన నేపథ్యంలో ఆండీ జాస్సీ మాట్లాడుతూ.. "మేము దశాబ్దానికి పైగా కాలంగా భారతదేశంలో పనిచేస్తున్నాం. ఈ కామర్స్, క్లౌడ్, ఏఐ రంగాల్లో అద్భుతమైన వృద్ధిని చూశాం. అందుకే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత పెట్టుబడి పెడుతున్నాం" అని చెప్పారు. అమెజాన్ లక్ష్యం.. కేవలం వ్యాపారం పెంచుకోవడం మాత్రమే కాదు. భారతదేశంలో చిన్న వ్యాపారాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకురావడం, ఉద్యోగాలను సృష్టించడం, ఎగుమతులను పెంచడం, ఏఐ సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం కూడా. అమెజాన్ పెట్టుబడులతో 2030 నాటికి భారతదేశంలో.. 38 లక్షలకు పైగా ఉద్యోగాలకు మద్దతు లభించనున్నాయి. 80 బిలియన్ డాలర్ల ఈకామర్స్ ఎగుమతులకు సహకారం, 1.5 కోట్ల చిన్న వ్యాపారాలు ఏఐ ప్రయోజనాలు పొందనున్నారు. పైగా 40 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ ప్రయోజనాలను అందించనుంది. అమెజాన్ కంపెనీ తన పెట్టుబడిలో భారీ మొత్తాన్ని ఏఐ, క్లౌడ్ రంగానికే కేటాయించనుంది. ఇందులో భాగంగా.. హైదరాబాద్, ముంబైలలో ఉన్న ఏడబ్ల్యుఎస్ డేటా సెంటర్లను మరింత విస్తరించనుంది. దీని వల్ల భారతీయ కంపెనీలు తమ డేటాను దేశంలోనే భద్రంగా నిల్వ చేసుకోవడంతో పాటు అత్యాధునిక ఏఐ టెక్నాలజీలను ఉపయోగించుకోగలుగుతాయి. ఇప్పటికే అనేక భారతీయ సంస్థలు ఏడబ్ల్యుఎస్ సేవలను ఉపయోగిస్తున్నాయి. ఇందులో బ్యాంకులు, స్టార్టప్‌లు, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. మొత్తం మీద అమెజాన్ తాజా ప్రకటన.. భారత ఆర్థిక వ్యవస్థకు, ఉద్యోగ అవకాశాలకు, సాంకేతిక అభివృద్ధికి కొత్త ఊపునిచ్చే అవకాశం ఉంది. ఇది ''డిజిటల్ ఇండియా'' లక్ష్యాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే మరో కీలక అడుగుగా చెప్పవచ్చు.

# భీమ్ యాప్ కొత్త రికార్డు.. ఏడాదిలో మూడు రెట్లు!




ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్‌బీఎస్ఎల్) రూపొందించిన 'భీమ్ పేమెంట్స్ యాప్', గత 12 నెలల్లో పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. 2025 జూన్, 2026 మే నెల మధ్య కాలంలో ఈ యాప్ ద్వారా లావాదేవీల పరిమాణం మూడు రెట్లకు పైగా పెరిగింది. ఈ యాప్‌లో నెలవారీ లావాదేవీల సంఖ్య 2025 జూన్‌లో 7.964 కోట్లుగా ఉండగా, 2026 మే నెల నాటికి అది ఏకంగా 24.4 కోట్లకు చేరుకుంది. ఒక్క 2026 మే నెలలోనే ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ. 26,952 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. దేశవ్యాప్తంగా రోజువారీ అవసరాల కోసం డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రజలు గణనీయంగా వినియోగిస్తున్నారనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. జాతీయ ధోరణికి అనుగుణంగానే తెలంగాణలో కూడా భీమ్ యాప్ వృద్ధి నమోదైంది. ఇక్కడ సైతం 2025 జూన్ నుంచి 2026 మే మధ్య లావాదేవీల పరిమాణం మూడు రెట్లు పెరిగింది. 2026 మే నెలలో ఈ యాప్ ద్వారా రాష్ట్రంలో జరిగిన మొత్తం మర్చంట్ లావాదేవీలలో నిత్యావసరాలు 23.9% శాతం వాటాతో మొదటి స్థానంలో ఉండగా, ఫుడ్ అవుట్‌లెట్స్ (18.1%), క్విక్ కామర్స్ (11.6%) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఇవే కాకుండా డెయిరీ అండ్ బేకరీలు (3.2%), పెట్రోల్ బంకులు (2.8%), ఈకామర్స్ (2.2%), ప్రభుత్వ సేవలు (2.0%) ఇతర ముఖ్యమైన కేటగిరీలుగా ఉన్నాయి. ఇది రోజువారీ ఖర్చులలో డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. వీటితో పాటు యూపీఐ లైట్, యూపీఐ ఆధారిత రూపే క్రెడిట్ కార్డ్ వంటి సరికొత్త పేమెంట్ విధానాలను కూడా రాష్ట్ర ప్రజలు విస్తృతంగా వాడుతున్నారు.

### యాప్‌లోని ముఖ్యమైన ఫీచర్లు

**యూపీఐ సర్కిల్:** ఈ ఫీచర్ ద్వారా యూజర్లు తమకు నమ్మకమైన వ్యక్తులకు నెలకు గరిష్టంగా రూ. 15,000 పరిమితితో, 5 సంవత్సరాల కాలవ్యవధి వరకు తమ ఖాతా నుంచి పేమెంట్స్ చేసుకునే అధికారాన్ని ఇవ్వవచ్చు. దీనికోసం అవతలి వారికి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా లేదా యూపీఐ ఐడీ ఉండాల్సిన అవసరం లేదు. దీనివల్ల కుటుంబ సభ్యులు, సిబ్బంది రోజువారీ ఖర్చులను, అన్ని లావాదేవీలను పర్యవేక్షించడం సులువవుతుంది.

**స్ప్లిట్ ఎక్స్ పెన్సెస్:** స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో కలిసి హోటల్‌కు వెళ్లినప్పుడు, రూమ్ అద్దెలు కట్టినప్పుడు లేదా గ్రూప్ కొనుగోళ్లు చేసినప్పుడు ఆ బిల్లును అందరూ సమానంగా పంచుకుని, నేరుగా యాప్ ద్వారానే ఎవరి వాటా వారు సులభంగా చెల్లించవచ్చు.

**ఫ్యామిలీ మోడ్:** కుటుంబ సభ్యులందరినీ ఒకే చోట చేర్చి, ఉమ్మడి ఖర్చులను ట్రాక్ చేయడానికి మరియు నిర్దిష్ట బిల్లుల చెల్లింపులను కేటాయించడానికి ఇది ఉపయోగపడుతుంది. దీనితో తమ ఖర్చులు ఒకే చోట కనిపించడం వల్ల కుటుంబ ఆర్థిక ప్రణాళిక సులువవుతుంది.

**స్పెండ్స్ అనలిటిక్స్:** ఈ డ్యాష్‌బోర్డ్ యూజర్ యొక్క నెలవారీ ఖర్చుల విధానాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఖర్చులను ఆటోమేటిక్‌గా కేటగిరీల వారీగా విభజించి చూపడం ద్వారా, ఎలాంటి క్లిష్టమైన లెక్కలు లేకుండానే బడ్జెట్‌ను మేనేజ్ చేసుకోవచ్చు.

**యూపీఐ లైట్ ఆటోటాప్ అప్:** యూపీఐ లైట్ వాలెట్‌లోని బ్యాలెన్స్ రూ. 200 కంటే తగ్గినప్పుడు, ఈ ఫీచర్ ఆటోమేటిక్‌గా వాలెట్‌ను రీఛార్జ్ చేస్తుంది.

**యూపీఐ బేస్డ్ రూపే క్రెడిట్ కార్డ్:** యూజర్లు తమ రూపే క్రెడిట్ కార్డ్‌ను యూపీఐకి లింక్ చేయడం ద్వారా క్రెడిట్ ఆధారిత లావాదేవీలను సులభంగా జరుపుకోవచ్చు.

**ఫారెక్స్ పేమెంట్స్:** విదేశీ కరెన్సీ (ఫారెక్స్) అవసరమైన వారు భీమ్ యాప్ ద్వారానే నేరుగా బుక్ చేసుకోవచ్చు. వివిధ బ్యాంకుల ధరలను పోల్చి చూసి నచ్చిన ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. ఈ కరెన్సీని నగదు రూపంలో లేదా డిజిటల్ కరెన్సీ రూపంలో పొందే వీలుంది.

# పొల్యూషన్ సర్టిఫికెట్‌పై వాహనదారులకు ఊరట!



బీఎస్6 ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కొత్త వాహనాల యజమానులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే శుభవార్త అందించే అవకాశం ఉంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ చెల్లుబాటు కాలాన్ని గణనీయంగా పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం బీఎస్6 వాహనాలకు నిర్దిష్ట వ్యవధిలో కాలుష్య పరీక్షలు నిర్వహించి పీయూసీ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించాల్సి ఉండగా, కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే ఆరు సంవత్సరాల లోపు ప్రైవేట్ బీఎస్6 వాహనాలకు ఒకేసారి మూడేళ్ల వరకు చెల్లుబాటు కల్పించే అవకాశం ఉంది. ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం ఆరు నుంచి పది సంవత్సరాల మధ్య ఉన్న బీఎస్6 వాహనాలు ప్రతి ఏడాది పీయూసీ సర్టిఫికెట్‌ని రెన్యువల్ చేయించుకోవాలి. పదేళ్లు దాటిన వాహనాలకు మాత్రం ప్రతి ఆరు నెలలకు ఒకసారి కాలుష్య ధ్రువీకరణ తప్పనిసరి కావచ్చు. వాణిజ్య బీఎస్6 వాహనాలకు ఆరు సంవత్సరాల వరకు రెండు సంవత్సరాల చెల్లుబాటు ఇవ్వాలని, ఆ తర్వాత వార్షిక పునరుద్ధరణ విధానాన్ని కొనసాగించాలని అధికారులు పరిశీలిస్తున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ మార్పులు 'PUCC 3.0' పేరుతో రూపుదిద్దుకుంటున్న సంస్కరణలలో భాగమని తెలుస్తోంది. బీఎస్6 వాహనాలు పాత తరహా బీఎస్ 4, బీఎస్3 వాహనాలతో పోలిస్తే నైట్రోజన్ ఆక్సైడ్లు, సూక్ష్మ ధూళికణాల ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తాయి. దీంతో తక్కువ కాలుష్యం విడుదల చేసే వాహన యజమానులపై అనవసర పరిపాలనా భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశంగా భావిస్తున్నారు. అయితే పాత వాహనాలపై మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశమూ ఉంది. ముఖ్యంగా అధిక కాలుష్యం వెదజల్లే వాహనాలకు తరచూ పరీక్షలు నిర్వహించడం, పీయూసీ కేంద్రాల్లో తప్పుడు రీడింగులు లేదా డేటా తారుమారును అరికట్టేందుకు పరీక్షా విధానాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం వంటి చర్యలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదే సమయంలో దేశంలో వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, పాత వాహనాలను దశలవారీగా తొలగించేందుకు స్క్రాపేజ్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై కూడా కేంద్రం దృష్టి సారించింది. అయితే పీయూసీ చెల్లుబాటు కాలం పెంపుపై ఇప్పటివరకు అధికారిక నోటిఫికేషన్ వెలువడలేదు. సంబంధిత ప్రతిపాదనకు తుది ఆమోదం లభించిన తర్వాతే కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.




# భారత్‌లో వివాదం.. మరి ఇతర దేశాల్లో పరిస్థితి ఏంటి?

**పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదంటూ కేంద్రం చేసిన తాజా వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. పాస్‌పోర్ట్ కోసం పోలీసు వెరిఫికేషన్ నుంచి పలు స్థాయిల పరిశీలన జరిగితే.. అదే పత్రాన్ని పౌరసత్వానికి ఆధారంగా ఎందుకు గుర్తించరనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ వివాదం మధ్య మరో ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. ప్రపంచంలోని ఇతర దేశాల్లో పరిస్థితి ఎలా ఉంది? పాస్‌పోర్ట్‌ను అక్కడ పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తిస్తారా? లేదంటే భారత్‌లాగే అభ్యంతరాలు ఉన్నాయా? పరిశీలిస్తే..**




పాస్‌పోర్ట్ అనగానే చాలా మందికి అది ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిరూపించే అత్యంత బలమైన పత్రంగా అనిపిస్తుంది. ఎందుకంటే సాధారణంగా ఏ దేశమైనా తన పౌరులకే పాస్‌పోర్ట్‌లు జారీ చేస్తుంది. అయితే చట్టపరంగా అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి ఉండదు. పాస్‌పోర్ట్‌కు ఇచ్చే చట్టబద్ధ హోదా దేశానికో విధంగా ఉంటుంది.

### అమెరికాలో..

ప్రపంచంలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి అత్యంత బలమైన ఆధారంగా గుర్తించే దేశాల్లో అమెరికా ముందుంటుంది. అక్కడ చెల్లుబాటు అయ్యే అమెరికన్ పాస్‌పోర్ట్ ఉంటే.. అది పౌరసత్వ ధ్రువీకరణ పత్రంతో సమానంగా పరిగణిస్తారు. ప్రభుత్వ సంస్థలు, కోర్టులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు కూడా సాధారణంగా అమెరికన్ పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి ప్రత్యక్ష ఆధారంగా అంగీకరిస్తారు. అమెరికాలో జనన ధ్రువీకరణ పత్రం (Birth Certificate), Certificate of Citizenship, US Passport.. ఈ మూడు ప్రధాన పౌరసత్వ ఆధారాలుగా పరిగణిస్తారు. వీటిలో పాస్‌పోర్ట్‌కే అత్యంత ప్రాధాన్యం ఉంటుంది.

### బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోనూ..

అమెరికా తరహాలోనే బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి కామన్ లా దేశాల్లో కూడా పాస్‌పోర్ట్‌కు భారీ చట్టబద్ధ ప్రాధాన్యం ఉంది. ఒక వ్యక్తి ఆ దేశ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉంటే.. సాధారణ పరిస్థితుల్లో అతడు ఆ దేశ పౌరుడేనని అధికారులు భావిస్తారు. అయితే అవసరమైతే పౌరసత్వ రికార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు, నేచురలైజేషన్ సర్టిఫికెట్లు వంటి అదనపు ఆధారాలను పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది.

### యూరప్‌లో పరిస్థితి ఎలా ఉందంటే..

జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్ వంటి యూరోపియన్ దేశాల్లో పాస్‌పోర్ట్ బలమైన పౌరసత్వ ఆధారంగా పరిగణించబడుతుంది. అయితే అక్కడ చాలా దేశాల్లో జాతీయ గుర్తింపు కార్డులు (National ID Cards) కూడా ఉంటాయి. అందువల్ల పౌరసత్వ నిర్ధారణలో పాస్‌పోర్ట్‌తో పాటు జాతీయ గుర్తింపు వ్యవస్థ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. యూరోపియన్ యూనియన్‌లోని అనేక దేశాల్లో పౌరులు దేశీయ ప్రయాణాలు, ప్రభుత్వ సేవల కోసం పాస్‌పోర్ట్ కంటే జాతీయ గుర్తింపు కార్డులనే ఎక్కువగా ఉపయోగిస్తారు.

### మరి భారత్‌లాంటి దేశాలు ఉన్నాయా?

అవును.. భారత్ మాత్రమే కాదు కొన్ని దేశాల్లో పాస్‌పోర్ట్ ఉన్నంత మాత్రాన అది పౌరసత్వానికి శాశ్వత, అంతిమ రుజువు కాదని భావిస్తారు. ఉదాహరణకు కెనడాలో పాస్‌పోర్ట్‌కు అధిక ప్రాధాన్యం ఉన్నప్పటికీ.. సిటిజన్‌షిప్ సర్టిఫికెట్ (Citizenship Certificate) అనే ప్రత్యేక పత్రాన్ని పౌరసత్వానికి మరింత బలమైన ఆధారంగా పరిగణిస్తారు. కొన్ని సందర్భాల్లో పాస్‌పోర్ట్‌తో పాటు పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాల్సి రావొచ్చు.

అలాగే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో జాతీయ పౌరసత్వ రిజిస్టర్లు, ప్రత్యేక సిటిజన్ కార్డులు, ప్రభుత్వ రికార్డులకే అధిక ప్రాధాన్యం ఉంటుంది. అసలు ఎన్ని దేశాలు పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తిస్తున్నాయి?. ఇదే ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై ఒకే విధమైన అధికారిక జాబితా లేదు. అయితే సాధారణంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ భాగం పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి బలమైన, ప్రాథమిక ఆధారంగా అంగీకరిస్తాయి. మరోవైపు కొన్ని దేశాలు మాత్రం అదనపు పౌరసత్వ ధ్రువీకరణ వ్యవస్థలను కూడా కొనసాగిస్తున్నాయి. అంటే ప్రపంచంలోని 190కి పైగా దేశాల్లో పాస్‌పోర్ట్‌కు ఉన్న చట్టబద్ధ హోదా ఒక్కో దేశంలో ఒక్కోలా ఉంటుంది.

### భారత్‌లో వివాదం ఎందుకంటే..

భారత్‌లో ప్రస్తుతం ప్రతి పౌరుడికి ఇచ్చే ఒకే ఒక్క "యూనివర్సల్ సిటిజన్‌షిప్ డాక్యుమెంట్" లేదు. ఆధార్ గుర్తింపును మాత్రమే నిర్ధారిస్తుంది. ఓటరు కార్డు ఓటు హక్కును సూచిస్తుంది. పాన్ కార్డు పన్ను అవసరాల కోసం. పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే. దీంతో పౌరసత్వాన్ని నిరూపించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ఒక్క పత్రం కాకుండా.. జనన ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల రికార్డులు, విద్యా ధ్రువపత్రాలు, ప్రభుత్వ రికార్డులు వంటి అనేక ఆధారాలను అధికారులు పరిశీలించాల్సి వస్తోంది.

### చర్చ ఎటు దారితీస్తోంది?

పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువా? కాదా? అనే ప్రశ్న కంటే.. భారత్‌లో ప్రత్యేక పౌరసత్వ గుర్తింపు వ్యవస్థ అవసరమా? అనే చర్చ ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో పాస్‌పోర్ట్ ఒక్కటే సరిపోతుండగా.. భారత్‌లో మాత్రం పౌరసత్వ నిర్ధారణకు బహుళ పత్రాల అవసరం కొనసాగుతోంది. అందుకే కేంద్రం చేసిన తాజా వ్యాఖ్యతో మొదలైన ఈ చర్చ.. ఇప్పుడు భారత పౌరసత్వ వ్యవస్థ భవిష్యత్తుపై పెద్ద చర్చగా మారుతోంది.

# ఆమె అలా సిగ్నల్ ఇచ్చింది.. ప్రియుడు తోసేశాడు!



పుణేకు చెందిన వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. తొలుత దీన్ని ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా భావించినప్పటికీ, అతని కాబోయే భార్య (ఫియాన్సే) సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి కలిసి పక్కా స్కెచ్‌తో చేసిన హత్య అని పుణే రూరల్ పోలీసులు వెల్లడించారు. మొదటి ప్రయత్నంలో ఒకసారి కొండంపై నుంచి తోసేసినప్పటికీ, కాబోయే భార్యను గుడ్డిగా నమ్మిన కేతన్ చివరకు ఆమె కుట్రకు బలికాక తప్పలేదు. వారు పక్కాగా అమలు చేసిన వారి ప్లాన్ గురించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గజానన్ టోంపే మరికొన్ని దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించారు.

### పక్కా ప్లాన్ ప్రకారం హత్య

పోలీసుల విచారణ ప్రకారం జూన్ 18న సియా గోయల్ తన పుట్టినరోజు వేడుకల నెపంతో కేతన్‌ను లోహగఢ్ కోటకు తీసుకువెళ్లింది. సియా ప్రియుడైన చేతన్ చౌదరి, ఆ జంటను రహస్యంగా లోహగఢ్ కోట వరకు ఫాలో అయ్యాడు. అంతేకాదు తన ఫోన్‌ను రూంలోనే వదిలి వచ్చాడు. కోటపై ఉన్న ఒక నిర్దేశిత ప్రదేశానికి చేరుకున్నాక, సియా ముందుగా అనుకున్న సిగ్నల్ ఇచ్చింది.

### ఏంటా సిగ్నల్

అందేంటి అంటే సడెన్ కూడా ఒకచోట కూర్చోవడం. అలా యాక్షన్‌కు "సమయం వచ్చింది" అని సైగ (సిగ్నల్) చేయాలి. అలా ఒకచోట కూర్చుని సియా సిగ్నల్ ఇవ్వగానే, వెనుక నుండి మాటు వేసిన చేతన్ చౌదరి, కేతన్‌ను ఒక్కసారిగా లోయలోకి తోసేసి అక్కడి నుండి పారిపోయాడు. దీనికి సంబంధిచి పోలీసులు కీలక ఆధారారాలను కూడా సేకరించారు. కోట కింద ఉన్న సీసీటీవీ విజువల్స్ పరిశీలించగా.. తలకి హుడీ (టోపీ) ధరించి పాలో అయిన వ్యక్తి చేతన్ చౌదరి అని పోలీసులు గుర్తించారు. చేతన్ చౌదరి కేవలం 50 నిమిషాల్లోనే కోట ఎక్కి, పని ముగించుకుని కిందకు దిగాడు. కోట పైన అతను గడిపింది కేవలం 10 నిమిషాలు మాత్రమే. ఎక్సర్‌సైజ్ కోసం వచ్చానని అక్కడ ఉన్నసెక్యూరిటీ గార్డుతో అబద్ధం చెప్పి తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని సెక్యూరిటీ గార్డు పోలీసులకు ధృవీకరించాడు. సాధారణ రోజుల్లో (వీక్‌డేస్) పెద్దగా జనం ఉండరనే కారణంతో పవనా డ్యామ్ వైపు ఉండే 'వించు కాటా' అనే లోయ ప్రాంతాన్ని వారు ఎంచుకున్నారు.

### ఇది నాలుగో ప్రయత్నం

అంతేకాదు కేతన్‌ను చంపేందుకు సియా, చేతన్‌లు అంతకుముందు కూడా మూడుసార్లు విఫలయత్నాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఒకసారి పాము నుండి రక్షిస్తున్నట్లు నటిస్తూ కేతన్‌ను తోసేయడానికి సియా ప్రయత్నించిందని విచారణలో తేలింది. అలాగే ఎలాగైనా కేతన్‌ను మట్టుబెట్టాలనే ఉద్దేశంతో తన పుట్టినరోజు వేడుకల పేరుతో జూన్ 18న లోహగడ్ కోటను సందర్శించేలా సియా, కేతన్‌ను ఒప్పించినప్పుడు ఆ అవకాశం లభించిందని పోలీసులు ఆరోపిస్తున్నారు.

# 16 రాష్ట్రాల్లో సీబీఐ భారీ దాడులు : ఇద్దరు అరెస్ట్

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు సాగించే 'డిజిటల్ అరెస్ట్' మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దేశవ్యాప్తంగా ఒక భారీ ఆపరేషన్ చేపట్టింది. 'ఆపరేషన్ చక్రVI' పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 16 రాష్ట్రాల్లోని 80కి పైగా ప్రాంతాల్లో సీబీఐ అధికారులుదాడులు నిర్వహించారు. ఈ దాడుల అనంతరం కోల్‌కతాలో ఒకర్ని, చెన్నైలో మరొకరిని అధికారులు అరెస్ట్ చేశారు. సుదీర్ఘ ఆపరేషన్‌లో భాగంగా సీబీఐ ప్రత్యేక బృందాలు గురువారం దేశంలోని 16 రాష్ట్రాలలో 80కి పైగా ప్రదేశాలలో సమన్వయంతో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. తెలంగా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ మహారాష్ట్ర, హర్యానా, తమిళనాడు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మణిపూర్, కర్ణాటక, ఒడిశా తదితర ప్రాంతాల్లో ఈ దాడులు చేపట్టింది. నకిలీ (షెల్) కంపెనీలను ఏర్పాటు చేసి, సైబర్ నేరాల సొమ్మును మళ్లించడానికి వీలుగా 'మ్యూల్ బ్యాంక్ ఖాతాలను' (మరొకరి పేరిట తెరిచే ఖాతాలు) నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను చెన్నై, కోల్‌కతాలలో సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు 200కంటే ఎక్కువ డిజిటల్ అరెస్ట్ స్కామ్ కేసులలో భాగస్వామ్యమై, దేశవ్యాప్తంగా విస్తరించిన ఒక పెద్ద నేరపూరిత నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం.



# 'ధర్మన్'.. 5 రూపాయల డాక్టర్ కథ కాదు, చాలా సెన్సిటివ్ సబ్జెక్ట్ : రజనీకాంత్



కమల్‌హాసన్, రజనీకాంత్‌లది సుమారు 50 ఏళ్ల స్నేహ బంధం. కెరీర్ ఆరంభించిన కొత్తలో వీరిద్దరూ కలిసి 10 చిత్రాలకు పైగా నటించారు. అలాంటిది ఇప్పుడు కమల్‌హాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్న చిత్రంలో రజనీకాంత్ హీరోగా నటిస్తుండటం విశేషం. బుధవారం ఈ చిత్రం ప్రారంభోత్సవం చెన్నైలోని కమల్‌హాసన్ కార్యాలయంలో జరిగింది. ఈ చిత్రానికి 'ధర్మన్' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రజనీకాంత్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. అశ్వద్ మారిముత్తు దర్శకత్వంలో... ఈ చిత్రానికి ముందు కేఎస్ రవికుమార్ దర్శకత్వం వహిస్తారనే వార్త వచ్చింది. ఆ తర్వాత డైరెక్టర్‌గా సుందర్ .సీని ఖరారు చేశారు. అయితే ఈ చిత్రం నుంచి సుందర్ తప్పుకున్నారు. దాంతో దర్శకుడిగా శిబి చక్రవర్తి పేరు వినిపించింది. చివరికి యువ దర్శకుడు అశ్వద్ మారిముత్తు పేరును ఖరారు చేశారు. ఈ వేడుకలో రజనీకాంత్ మాట్లాడుతూ- ''కమల్‌హాసన్ తన సంస్థలో సినిమా చేయాలని కోరారు. అయితే కథ వినను అన్నారు. నన్నే ఎంపిక చేసుకోమని భారమంతా నాపై పెట్టే ప్రయత్నం చేశారు. కానీ కథ ఎంపికలో మీ భాగస్వామ్యం ఉండాలని చెప్పడంతో విన్నారు. ఆ తర్వాత ఈ కథను ఓకే చేశాం. ఇది 5 రూపాయల వైద్యుడి ఇతివృత్తంతో రూపొందిస్తున్న చిత్రం కాదు. స్వాగ్ అనే వైద్యుడి ఇతివృత్తంతో రూపొందిస్తున్న చిత్రం. ఇది చాలా సెన్సిటివ్ సబ్జెక్ట్. ఇందులో నేను న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేసే సైంటిస్ట్‌గా కనిపిస్తాను. ఆఫ్ఘనిస్థాన్, రష్యాలో షూటింగ్ ప్లాన్ చేశాం. ఇది తీయడానికి చాలా సమయం పడుతుంది. అందుకే చివరకు అశ్వత్ మారిముత్తు ఈ ప్రాజెక్టులోకి వచ్చాడు' అని చెప్పారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ- ''నేను, రజనీకాంత్ సినిమా చేయాలనేది ఎప్పటి నుంచో ఉన్న కోరిక. ఎన్నో ఏళ్ల చర్చల తర్వాత ఆ కల నిజమవుతోంది. మా సంస్థలో రజనీకాంత్ హీరోగా నటిస్తుండటం సంతోషంగా ఉంది. దర్శకుడు అశ్వద్ మారిముత్తు, సంగీత దర్శకుడు అనిరుధ్‌తో పాటు మొత్తం టీమ్‌పై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు. అశ్వద్ మారిముత్తు మాట్లాడుతూ - ''రజనీకాంత్‌గారితో సినిమా చేయాలని ప్రతి దర్శకుడు కోరుకుంటారు. ఆ చాన్స్ నాకు రావడం హ్యాపీగా ఉంది. రజనీకాంత్‌గారు నటించిన 'పడయప్పన్', కమల్‌హాసన్‌గారు నటించిన 'వేట్టైయాడు విలైయాడు' చిత్రాల తరహాలో 'ధర్మన్' ఉంటుంది'' అని తెలిపారు.



## ఎవరితోనూ రిలేషన్ షిప్‌లో లేను: శ్రుతి హాసన్

సంచలన నటీమణుల్లో శ్రుతి హాసన్ ఒకరిని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అంతే కాదు చాలా బోల్డ్ నటి కూడా. ప్రేమ, పెళ్లి విషయంలో చాలా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే నటి. ప్రఖ్యాత నటుడు, సినీ వికీపీడియా కమలహాసన్ వారసురాలు అయిన శ్రుతి హాసన్ స్వతంత్ర భావాలు కలిగిన నటి. ఆ మధ్య ప్రేమించిన వ్యక్తిని తన తండ్రికి పరిచయం చేసిన గట్స్ ఉన్న నటి ఈ భామ. హిందీ చిత్ర పరిశ్రమలో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చి, ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయకిగా రాణిస్తున్న విషయం తెలిసిందే. అంతే కాకుండా సంగీత దర్శకురాలు,గాయని అంటూ పలు శాఖల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఇటీవల ఈమె నటుడు రజనీకాంత్‌తో కలిసి కూలీ చిత్రంలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. తమిళంలో విజయ్ సేతుపతి కి జంటగా నటించిన ట్రైన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇటీవల కథానాయకిగా బిజీగా లేకున్నా అభిమానులతో తరచూ సోషల్ మీడియా ఇంటరాక్టివ్ అవుతూ తమ భావాలను పెంచుకుంటూ వార్తల్లో ఉంటున్నారు. అలా తాజాగా అభిమానులతో ముచ్చటించారు. అందులో ఒకరు మీరు రిలేషన్ షిప్ లో ఉన్నారా అని అడగ్గా '' నేను రిలేషన్ షిప్ లో లేనని స్పష్టం చేశారు. అదేవిధంగా మీరు సినీ రంగంలో లేకుంటే ఏం చేసేవారు అన్న ప్రశ్నకు పిల్లల మనోతత్వ వైద్యురాలినన్నే దానిని పేర్కొన్నారు. ఈమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



## బాలయ్య-కొరటాల సినిమా షురూ

కొరటాల శివ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 'NBK 112' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కబోతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమం అమరావతిలో ఘనంగా జరిగింది. బాలకృష్ణ అల్లుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరరై క్లాప్ కొట్టగా.. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. బాలయ్య ఓ డైలాగ్ చెప్పి అలరించాడు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, నిర్మాత సురేశ్ బాబుతోపాటు మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఆగస్ట్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు మేకర్స్ తెలిపారు. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నేపాల్ ప్రకృతి అందాల మధ్యలో మీనాక్షి చౌదరి..





ప్రస్తుతం తెలుగులో ది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల లిస్టులో మీనాక్షి చౌదరి కూడా ఒకరు. ఇటీవల ఈ అమ్మడు నటించిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ అవుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టుతున్నాయి. 2024లో మీనాక్షి నటించిన లక్కీ భాస్కర్ వంద కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఇక గతేడాది వెంకటేష్ తో కలిసి ఆమె నటించిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ రూ. 350 కోట్లకు పైగా కలెక్షన్లు కూడా సాధించింది. ఇక ఈ ఏడాది సంక్రాంతికి అనగనగా ఒక రాజు సినిమాతో మరో బ్లాక్ బస్టర్ అందుకుందీ ముద్దుగుమ్మ. ఈ మూవీ కూడా రూ. 100 కోట్లకు పైగానే కలెక్షన్లు సాధించింది. ఆమె కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం అక్కినేని నాగార్జునతో కలిసి వృషకర్మ అనే హారర్ థ్రిల్లర్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది మీనాక్షి. విరూపాక్షి సినిమాతో అందరి దృష్టి ఆకర్షించిన కార్తీక్ దండు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంటోన్న మీనాక్షి తాజాగా నేపాల్ వెకేషన్‌కు వెళ్లింది. అక్కడి ప్రకృతి అందాలను మనసారా ఆశీర్వదించి. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆమెనే స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారాయి.



## మరో ఓటీటీలో పాపం ప్రతాప్..

తిరువీర్, రాశి, పాయల్ రాధాకృష్ణ కీలక పాత్రల్లో నటించిన చిత్రం పాపం ప్రతాప్. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది. ప్రస్తుతం ఈ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రానికి ఎస్పీ దుర్గా నరేశ్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీ మరో ఓటీటీకి వచ్చేసింది. నేటి నుంచే అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఇంకెందుకు ఆలస్యం ఈ మూవీని చూసి ఎంజాయ్ చేయండి.

**పాపం ప్రతాప్ కథేంటంటే..**

ఈ సినిమా కథ 199498 మధ్య కాలంలో సాగుతుంది. ప్రతాప్ (తిరువీర్)కి బుజ్జమ్మ( పాయల్ రాధాకృష్ణ) అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. వయసుతో పాటు ఆమెపై ప్రేమ కూడా పెరుగుతుంది. ఓ రోజు బుజ్జమ్మనే 'పెళ్లి చేసుకుందామా' అని అడగడంతో..ప్రతాప్ వెంటనే ముహూర్తం పెట్టిస్తాడు. నాన్న రంగయ్య(అజయ్ ఘోష్)కి ఇష్టం లేకపోయినా.. అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకుంటాడు. మొదటి మూడు రాత్రులు గడవగానే బుజ్జమ్మ పంచాయితీ పెడుతుంది. ప్రతాప్‌కి సమస్య ఉందని.. అతనితో సంసారం చేయలేనని ఊరి పెద్దలకు చెబుతుంది. ప్రతాప్‌కి ఉన్న సమస్య ఏంటని అడిగితే మాత్రం బయటకు చెప్పదు. అంతేకాదు తనలోని సమస్యేమిటో తనే తెలుసుకుని సరిదిద్దుకుంటేనే కాపురానికి వస్తానని చెప్పి..పుట్టింటికి వెళ్లిపోతుంది. అసలు ప్రతాప్‌కి ఉన్న సమస్య ఏంటి? ఆ సమస్యను కనుక్కునేందుకు ప్రతాప్ చేసిన ప్రయత్నాలు ఏంటి? సమస్య తెలుసుకున్నాక..దాన్ని సరిదిద్దుకున్నాడా లేదా? చివరకు బుజ్జమ్మ, ప్రతాప్ ఒక్కటయ్యారా లేదా ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

## శ్రీలీల ఆ టాలీవుడ్ స్టార్ డైరెక్టర్‌కు కోడలు అవుతుందని తెలుసా?



జయపజయాలతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తోంది టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల. చివరిగా పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో హీరోయిన్ గా చేసిందీ ముద్దుగుమ్మ. ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీ తదితర భాషల్లో సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంటోంది శ్రీలీల. కాగా ఆదివారం (జూన్ 14) శ్రీలీల పుట్టిన రోజు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఆమెకు బర్త్ డే విషెస్ చెప్పారు. ఇదే సమయంలో శ్రీలీల వ్యక్తిగత జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో బాగా వైరలయ్యాయి. కాగా శ్రీలీల ప్రస్తుతం టాలీవుడ్ లో టాప్ డైరెక్టర్ గా వెలుగొందుతోన్న అనిల్ రావిపూడికి కోడలు అవుతుందట. శ్రీలీల తనకు వరసకు అక్క కూతురు అవుతుందని అనిల్ రావిపూడినే ఓ సినిమా ప్రమోషన్ సందర్భంగా చెప్పుకొచ్చారు.


## సమంత తన భర్తని ముద్దుగా ఏమని పిలుస్తుందో తెలుసా?



సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతోంది. ఈ నెల 19న విడుదలైన ఈ చిత్రానికి తొలి రోజు మిక్స్‌డ్ టాక్ వచ్చినా.. వీకెండ్‌లో పుంజుకొని, నాలుగు రోజుల్లోనే రూ. 50 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత సామ్ నటించి చిత్రం సూపర్ డూపర్ హిట్ అవ్వడంతో ఆమె అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక వారి ఆనందాన్ని రెట్టింపు చేసే గుడ్ న్యూస్ చెప్పింది సమంత. తాను ప్రెగ్నెంట్ అనే విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. బుధవారం నిర్వహించిన మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో ఆమె ఈ విషయాన్ని చెప్పింది. ఇదే ఈవెంట్‌లో తన భర్తను ముద్దుగా ఏమని పిలుస్తుందో కూడా ఆమె చెప్పింది. మా ఇంటి బంగారం చిత్రంలో సమంత తన భర్త అనిరుధ్‌ని ముద్దుగా హనీ అని పిలుస్తుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. నిజ నీజ జీవితంలో భర్త అయిన రాజ్‌ని ప్రేమగా ఏమని పిలుస్తారు అని సక్సెస్ మీట్‌లో సమంతను అడిగింది యాంకర్. దానికి సమంత సిగ్గుపడుతూ సమాధానం చెప్పింది. 'రాజ్‌ని ఇంట్లో వాళ్ల అమ్మ, చెల్లి ప్రేమగా బాబు అని పిలుస్తారు. నేను కూడా అలానే పిలుస్తాను అని నవ్వుతూ చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో క్లిప్పు నెట్టింట వైరల్ అవుతోంది.

కాగా, 2025లో వివాహ బంధంతో ఒక్కటయ్యారు సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు. ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్ చేస్తున్న సమయంలోనే రాజ్‌తో సమంతకు పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ల తర్వాత ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి..పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు.

## మహేశ్‌బాబుపై ఆగ్రహం.. ప్రభాస్‌పై ఇలా.. పృథ్వీరాజ్ ఆసక్తికర కామెంట్స్!







దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం వారణాసి. ఈ మూవీలో ప్రిన్స్ మహేశ్ బాబు హీరోగా నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న తొలి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్, సలార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్‌కు విరామం లభించడంతో మహేశ్ బాబు ఫ్యామిలీతో కలిసి ఫారిన్ ట్రిప్‌కు వెళ్లారు. ఇదిలా ఉండగా మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ముఖ్యంగా సలార్ హీరో ప్రభాస్, మహేశ్ బాబు గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఆయన ప్రభాస్ గురించి ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. "ఒక సన్నివేశం కోసం మహేష్ బాబు దాదాపు 9095 టేక్స్ తీసుకున్నారు. ఆ సమయంలో రాజమౌళి చాలా అసహనానికి గురై ఆ రోజు షూటింగ్‌ను నిలిపివేసి ప్యాక్ అప్ ప్రకటించారు" అని తెలిపారు. అయితే దీనిని విమర్శగా కాకుండా మహేశ్ తన పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో ఎంత కష్టపడతారో చెప్పే సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. "రాజమౌళి ఎప్పుడూ చెబుతుంటారు.. ప్రభాస్‌కు పెద్దగా ఏమీ చేయాల్సిన అవసరం ఉండదు. ఆయన కేవలం కెమెరా ముందు నిలబడితే చాలు.. మిగతా వాళ్లంతా తమ ప్రదర్శనతో ఆకట్టుకోవడానికి శ్రమిస్తుంటారు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. పృథ్వీరాజ్ సుకుమారన్ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఒకవైపు మహేష్ బాబు పాత్ర కోసం ఎంత కష్టపడతారో చెబుతూనే.. మరోవైపు ప్రభాస్‌కు ఉన్న స్క్రీన్ ప్రెజెన్స్ ఎంత ప్రత్యేకమో అని ప్రశంసించారని అభిమానులు భావిస్తున్నారు. ఏదేమైనా మన టాలీవుడ్ స్టార్ హీరోలపై సలార్ స్టార్ చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com